epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com





సంపుటి : 17 సంచిక : 325 | 04-01-2026 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00

## బిఆర్ఎస్ హయాంలో ఏపి కృష్ణాజలాల

# జలదోపిడీ



- శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా తరలింపు
- రోజుకు 13 టిఎంసిల నీరు తరలించుకుపోయిన ఏపి
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోని బిఆర్ఎస్
- చోద్యం చూస్తూ కూర్చున్న నాటి సిఎం కెసిఆర్
- కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ మంత్రి ఉత్తమ్



6 లో..

బిఆర్ఎస్ హయాంలోనే ఏపి నీటి దోపిడీ జరిగిందని, అందుకు నాటి సిఎం కెసిఆర్ చూస్తూ ఊరుకున్నారని అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ సర్కారు చోద్యం చూసిందన్నారు. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించింది. జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల విషయంలో గొప్పగా చేశామంటూ బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోందని విమర్శించారు.



## మూడోరోజు అసెంబ్లీ ప్రారంభం

2వ పేజీ

**సమస్యలపై బిజెపి ఎమ్మెల్యే ప్రస్తావన**

**చనాక కోరాట నిర్వాసిత సమస్యలపై పాయల శంకర్ వెల్లడి**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజు శనివారం ప్రారంభం అయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా బీజేపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా నీటిపారుదల ప్రాజెక్టులు, నిర్వాసిత రైతులకు పరిహారం, సాగునీటి సౌకర్యాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు బీజేపీ ఎమ్మెల్యేలు.



2వ పేజీ

## ఉమ్మడి ఏపిలో కూడా ఇలా జరగలేదు

ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కిరణ్‌కుమార్ రెడ్డి అప్పట్లో స్పీకర్‌గా ఉండే అని.. ఆ తర్వాత మనోహర్ అయ్యారని.. అయినా ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు జరగలేదని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చేదని గుర్తుచేశారు.

## కొండగట్టు అంజన్న.. నా ప్రాణదాత

- స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- పలు అభివృద్ధి పనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన

2వ పేజీ



## ఆనాడు విపక్షంలో అన్నదేమిా..ఇప్పుడు చేస్తున్నదేమిటి

- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరు కాలేదా
- నాటి ఉత్తమ్ లేఖను బయటపెట్టిన హరీష్ రావు

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు. అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోమని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.



2

## ఎన్నికలకు ముందే మహాయుతి దూకుడు

**పురపోరులో 68 స్థానాలు దక్కించుకున్న కూటమి**

ముంబై,

మహారాష్ట్ర పురపోరులో.. అధికార ప్రభుత్వం విజయకేతనం ఎగురవేసింది. పోలింగ్‌కు ముందే భాజపా నేతృత్వంలోని మహాయుతి కూటమి పలు స్థానాల్లో విజయం సాధించింది. ఎన్నికలు లేకుండానే 68 స్థానాల్లో ఈ కూటమి అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ క్రమంలో ప్రత్యర్థి పార్టీలకు చెందిన పలువురు అభ్యర్థులు పోటీ నుంచి వైదొలిగారు. దీంతో పలు స్థానాల్లో పోటీ లేకుండానే విజయం లభించింది. ఇందులో భాజపా 44, ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేన పార్టీకి 22, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ రెండు స్థానాలు గెలుచుకున్నాయి.



2వ పేజీ

## ఛత్తీస్‌గడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

**ఎదురు కాల్పుల్లో 12మంది నక్సల్స్ హతం**

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నారు.

## హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం: ఏపీ బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు అరెస్ట్

- డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కొడుకు
- నానక్‌రామ్‌గూడలో ఈగల్ టీం దాడుల్లో పట్టుబడిన సుధీర్ రెడ్డి
- డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారించిన పరీక్షల్లో పాజిటివ్ ఫలితం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

హైదరాబాద్‌లో డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే కుమారుడు అరెస్ట్ కావడం సంచలనం సృష్టిస్తోంది. కడప జిల్లా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి కుమారుడు సుధీర్ రెడ్డిని తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ తీసుకుంటుండగా అతడు పట్టుబడినట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే, నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న సమాచారంతో తెలంగాణ పోలీసుల ప్రత్యేక విభాగమైన 'ఈగల్ టీం' ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో సుధీర్ రెడ్డి డ్రగ్స్ తీసుకుంటుండగా పట్టుబడినట్లు సమాచారం. వెంటనే అతనికి అక్కడికక్కడే డ్రగ్స్ నిర్ధారణ పరీక్షలు చేయగా, ఫలితం పాజిటివ్‌గా వచ్చింది. దీంతో పోలీసులు సుధీర్ రెడ్డిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అనంతరం అతడిని నర్సింగి పోలీసులకు అప్పగించినట్లు తెలుస్తోంది. సుధీర్ రెడ్డిని డి-అడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. సుధీర్ రెడ్డి తండ్రి ఆదినారాయణ రెడ్డి ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. గతంలో ఆయన టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు.



## అడ్డగోలుగా హైదరాబాద్ విభజన

2

హైదరాబాద్ మహా నగరాన్ని అడ్డగోలుగా విభజిస్తున్నారని అసెంబ్లీలో బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా హైదరాబాద్‌ను విభజించినట్లు ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు.

## మావోయిస్ట్ అగ్రనేత బర్సే సుక్కా లొంగుబాటు

**ఆయుధాలు, డబ్బును అప్పగించిన మావోయిస్టులు డిజిపి శివధర్ రెడ్డి ముందు లొంగుబాటు**

2



# మూడోరోజు అసెంబ్లీ ప్రారంభం

## సమస్యలపై బిజెపి ఎమ్మెల్యే ప్రస్తావన

## చనాక కోరాట నిర్వాసిత సమస్యలపై పాయల శంకర్ వెల్లడి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజు శనివారం ప్రారంభం అయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా బీజేపీ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా నీటిపారుదల ప్రాజెక్టులు, నిర్వాసిత రైతులకు పరిహారం, సాగునీటి సౌకర్యాలపై ప్రభుత్వాన్ని నిలదీశారు బీజేపీ ఎమ్మెల్యేలు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతుల సమస్యలను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సభలో లేవనెత్తారు. చనాక కోరాట ప్రాజెక్ట్ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే భూములకు లక్షల రూపాయలే పరిహారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. పదేళ్లు అయ్యిందన్నారు. నీళ్లు రాలేదని.. పరిహారం రాలేదని ఆదిలాబాద్ రైతులు పాదయాత్రగా హైదరాబాద్‌కు వచ్చారని తెలిపారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసి వెంటనే భూనిర్వాసితులకు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. జైనాథ్‌పూర్ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు కోరారు. నిధుల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని... ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రిని కలిసినా ÷ళ్లు కదలడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రెండు మండలాల్లో సాగునీరు అందుతుందన్నారు. రైతులకు భారీ లాభం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ డిమాండ్ చేశారు. అలాగే ప్రిప్రీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కూడా వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువల ఆధునీకరణకు రూ.2,000 కోట్లు కేటాయించాలని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. రెండు వేల కోట్లు విడుదల చేస్తేనే నిజాం సాగర్ కాలువల ఆధునీకరణ సాధ్యమవుతుందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, స్వరాష్ట్రంలోనూ నిజామాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని విమర్శించారు. గత రెండు సంవత్సరాలుగా నీటిపారుదల శాఖ మంత్రి నవ్వుతూనే ఉన్నారని, కానీ సమస్యలపై స్పష్టమైన చర్యలు లేవని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే ÷డి రాకేష్ రెడ్డి ఆరోపించారు.

# ఉమ్మడి ఎపిలో కూడా ఇలా జరగలేదు

## స్పీకర్ తీరు బాధాకరమన్న గంగుల కమలాకర్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇన్ని అవమానాలు ఎదుర్కోలేదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కిరణ్‌కుమార్ రెడ్డి అప్పట్లో స్పీకర్‌గా ఉండే అని.. ఆ తర్వాత మనోహర్ అయ్యారని.. అయినా ఉద్యమ సమయంలో ఇలాంటి అవమానాలు జరగలేదని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న సభ్యులు అందరికీ సమాన హక్కులు ఉంటాయని అప్పటి స్పీకర్ మనోహర్ తమకు సమయం ఇచ్చేదని గుర్తుచేశారు. కానీ నిన్న అసెంబ్లీలో స్పీకర్ తీరు బాధాకరమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలా నిర్బంధం చేయలేదని.. మా గొంతు నొక్కలేదని గంగుల కమలాకర్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాలిపోయిన మోటార్లు, ఎండిపోయిన పంటలను అసెంబ్లీకి తీసుకొనిపోయామని గుర్తుచేశారు. పక్షపాత వైఖరితో ఉండకండి అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు హితవు పలికారు. మీ వ్యవహార శైలిని మార్చుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రికి ఎలాంటి హక్కు ఉంటుందో అందే అందరు సభ్యులకు ఉంటుందని తెలిపారు. మా హక్కుల కోసమే మాట్లాడామని చెప్పారు. నిన్న అసెంబ్లీలో గిల్లికజ్జాలు పెట్టుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి చూశాడని గంగుల కమలాకర్ అన్నారు. మమ్మల్ని తిట్టేందుకే సభకు వచ్చాడని, కడుపునిండా తిట్టి వెళ్లాడని విమర్శించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రెండు గంటలు మాట్లాడతాడా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఎజెండా కూడా పొద్దున రెండుగంటలకు ఇస్తారా అని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంపై మాట్లాడటానికి నేను, జగదీశ్ రెడ్డి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వమని చెప్పడమేంటని స్పీకర్‌పై గంగుల కమలాకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి మేం భజన చేయాలా అని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అసెంబ్లీ హుందాగా నడిచిందని తెలిపారు. గత స్పీకర్ ప్రతిపక్షాలకు తగినంత సమయం ఇచ్చేవారని గుర్తుచేశారు. ప్రస్తుత స్పీకర్ బీఆర్ఎస్ సభ్యుల గొంత నొక్కేందుకు పనిచేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీని గాంధీ భవన్‌లా, రేవంత్ ప్యాలెస్‌లా నడిపిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి భజన చేసేందుకు అసెంబ్లీకి వెళ్లాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్, సీఎం సభ సంప్రదాయాలను తుంగలో తొక్కుతున్నారని అన్నారు.

# ఛత్తీస్‌గడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

## ఎదురు కాల్పుల్లో 12మంది నక్సల్స్ హతం

రాయపూర్, అక్షరకలం ప్రతినిధి

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారని పోలీసులు వెల్లడించారు. మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కిష్టారం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం సుక్మా జిల్లా రిజర్వ్ గార్డ్ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో పామ్లూరు గ్రామం సమీపంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం 12 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా.. మంగడు మినహా మిగతా వారి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. మరోవైపు.. బీజాపుర్ జిల్లాలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. ఈ ఎదురుకాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని అధికారులు వెల్లడించారు. కాగా.. గత ఏడాది జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 285 మందికిపైగా మావోయిస్టులు మృతి చెందారు ఛత్తీస్‌గఢ్‌లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది నక్సల్స్ మృతి చెందినట్టు తెలుస్తోంది. సుక్మా జిల్లాలో తెల్లవారుజామున ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ప్రాంతంలో భద్రతా దళాలు భారీ స్థాయిలో ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నాయి. నక్స్‌లైట్ల సంచారం ఉన్నట్టు సమాచారం అందడటంతో జిల్లాకు చెందిన రిజర్వ్ గార్డ్ పోలీసుల బృందం ఈ తెల్లవారుజామున రంగంలోకి దిగింది. ఈ క్రమంలోనే నక్సల్స్, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం, ప్రస్తుతం ఆ ప్రాంతంలో కాల్పులు కొనసాగుతున్నాయి.

# అడ్డగోలుగా హైదరాబాద్ విభజన

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ తలసాని

## దమ్ముంటే హైదరాబాద్ పేరు మార్చాలని డిమాండ్

హైదరాబాద్,

: హైదరాబాద్ మహా నగరాన్ని అడ్డగోలుగా విభజిస్తున్నారని అసెంబ్లీలో బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గూగల్ మ్యాప్ ఆధారంగా హైదరాబాద్‌ను విభజించినట్లు ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో కేపీ వివేకానందతో కలిసి తలసాని మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలకు చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉందని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కానీ ఎంతో చరిత్ర ఉన్న సికింద్రాబాద్‌ను ఇష్టమొచ్చినట్లు విభజిస్తున్నారని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఇతరత్రా ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రకటించారు. మద్దతిచ్చే పార్టీలతో కలిసి నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. టెక్నికల్ స్టడీ లేకుండానే ప్రాంతాలను విభజిస్తున్నారని అన్నారు. జంట నగరాల ఉనికి లేకుండా కుట్ర చేస్తున్నారని తలసాని ఆరోపించారు. సికింద్రాబాద్ చరిత్రను, సంస్కృతిని నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. సికింద్రాబాద్ కార్పొరేషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ధైర్యం ఉంటే హైదరాబాద్ పేరు మార్చి చూడమని సీఎం రేవంత్ రెడ్డికి సవాలు విసిరారు.

# కొండగట్టు అంజన్న.. నా ప్రాణదాత

## స్వామిని దర్శించుకుని

## ప్రత్యేక పూజలు

## పలు అభివృద్ధి పనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన

జగిత్యాల, అక్షరకలం ప్రతినిధి





కొండగట్టు అంజన్న దయ వల్లనే తాను ప్రాణాలతో బయటపడ్డానని, ఆయనంటే తనకు ఎన్నలేని భక్తి విశ్వాసాలని ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ.35.19 కోట్ల తితిదే నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. తితిదే సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది' అని అన్నారు. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆనాడు విపక్షంలో అన్నదేమిా.. ఇప్పుడు చేస్తున్నదేమిటి

## పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరు కాలేదా

## నాటి ఉత్తమ్ లేఖను బయటపెట్టిన హరీష్ రావు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అసెంబ్లీలో ఆడియో, వీడియో ప్రజెంటేషన్ నిర్వహిస్తే సభకు హాజరుకాబోమని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాసిన లేఖ గుర్తుందా అని ప్రశ్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా 30-03-2016 న మీరు స్పీకర్‌కు రాసి సంతకం పెట్టిన ఉత్తరం గుర్తుందా? అని నిలదీశారు. అసెంబ్లీలో ఆడియో-విజువల్ ప్రెజెంటేషన్ నిర్వహిస్తే, అది భారత దేశ పార్లమెంట్ సంప్రదాయాలకు విరుద్ధం. అందుకే మేము సభకు హాజరుకాబోమని నాడు టీపీసీసీ అధ్యక్షుడిగా లేఖ రాసి.. నేడు మంత్రి హోదాలో అసెంబ్లీ హాలులో ప్రజెంటేషన్‌కు సిద్ధపడటం.. మీ రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. ఆ ఉత్తరంపై నేటి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పద్మావతి సంతకాలు చేశారని హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అనైతికత, ద్వంద్వ ప్రమాణాలను ఈ ఒక్క ఉత్తరం బట్టబయలు చేస్తుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విలువలు, రాజ్యాంగం, పార్లమెంట్ స్ఫూర్తి వంటి మాటలు వల్లెవేస్తారని.. అధికారంలోకి రాగానే అదే విలువలకు తిలోదకాలు ఇస్తారని మండిపడ్డారు. ఇదే కాంగ్రెస్ పార్టీ అసలు నైజమని వ్యాఖ్యానించారు. అధికార పక్షానికి ప్రజెంటేషన్‌కు అనుమతినిస్తే.. బీఆర్ఎస్‌కూ అదేవిధంగా అనుమతి ఇవ్వాలని బీఏసీ సమావేశంలో, ఉత్తరం ద్వారా స్పీకర్‌ను కోరామని హరీశ్‌రావు తెలిపారు. అయినప్పటికీ ఆ అభ్యర్థనను స్పీకర్ తిరస్కరించారని పేర్కొన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అసలు తేడా అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. కాంగ్రెస్ అన్ని సంప్రదాయాలు, పద్ధతులు, మర్యాదలకు భంగం కలిగిస్తూ.. రాజ్యాంగానికే తూట్లు పొడవడాన్ని తన మార్పుగా చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆ మార్పు అసలు అర్థం ఏమిటో ప్రజలు ఇప్పుడు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

# అసెంబ్లీలో స్పీకర్ పక్షపాత వైఖరి

## సిఎం రేవంత్ తీరు అధ్వాన్నం

## అందుకు అసెంబ్లీకి వెళ్లడం లేదు

## మాజీమంత్రి వేమలు ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

అసెంబ్లీలో స్పీకర్ పక్షపాత వైఖరిని తెలంగాణ సమాజం గమనించిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో సుదీర్ఘ ప్రసంగం చేయడం శాసనసభ చరిత్రలో ఇప్పటివరకు లేదని తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో సీఎం రేవంత్ గంటన్నర పాటు మాట్లాడడం శాసనసభ నిబంధనకు విరుద్ధమని తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని చెబుతూనే.. మూసీ ప్రక్షాళనకు వేల కోట్లు ఎట్లా ఖర్చు చేస్తారని హరీశ్‌రావు అడిగారని.. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పకుండా అడ్డగోలుగా మాట్లాడారని మండిపడ్డారు.ముఖ్యమంత్రి స్థాయిలో ఉండి గంటన్నర పాటు మా సభ్యులపై అసభ్యంగా మాట్లాడటం దారుణమని వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. స్పీకర్ అడ్డు చెప్పకుండా.. ప్రతిపక్షాలకు అవకాశం కల్పించకుండా చేయడం అన్యాయమని అన్నారు. ప్రతిపక్షానికి కనీసం మాట్లాడటానికి అవకాశం ఇవ్వడం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి తప్పులను ఎత్తిచూపేందుకు మైక్ ఇవ్వడం లేదని అన్నారు. ముఖ్యమంత్రిని విమర్శిస్తే మైక్ ఇవ్వను అని స్వయంగా స్పీకర్ చెప్పడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. మాకు మైక్ ఇవ్వనప్పుడు అసెంబ్లీకి వెళ్లి ఏం లాభమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ సభ్యులకు మాట్లాడేందుకు కనీసం అవకాశం కల్పించడం లేదని.. అందుకే బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిందని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలని కోరారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 2016లో శాసనసభలో కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తుచేశారు. అప్పుడు కాంగ్రెస్ సభ్యులు శాసనసభను బహిష్కరించారని తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వడం శాసనసభ నిబంధనలకు విరుద్ధం అని కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉన్నప్పుడు స్వయంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క స్పీకర్ కు ఉత్తరం రాసి, సంతకాలు చేశారని పేర్కొన్నారు. కానీ ఇప్పుడు వాళ్లే ప్రజెంటేషన్ ఇస్తున్నారని.. ఇది కాంగ్రెస్ ద్వంద్వనీతికి నిదర్శనమని ఆరోపించారు. అప్పుడు టీడీపీలో ఉన్న రేవంత్ రెడ్డి కూడా పీపీటీని వ్యతిరేకించారని.. ప్రస్తుతం కాంగ్రెస్ మళ్లీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు సిద్ధమైందని అన్నారు. బీఆర్ఎస్ కు కూడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని స్పీకర్ కు ఉత్తరం రాశామని తెలిపారు. బీఆర్ఎస్‌కు పీపీటీ అవకాశం కల్పిస్తే సభకు వెళ్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా అసెంబ్లీలో ఇన్ని అవమానాలు జరగలేదని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ వాదాన్ని కూడా అసెంబ్లీలో గట్టిగా చెప్పామని తెలిపారు. గతంలో శాసనసభకు కాలిన మోటార్లు, ఎండిన వరి పైరులు తీసుకెళ్లామని గుర్తుచేశారు.




# మావోయిస్ట్ అగ్రనేత బర్సే సుక్కా లొంగుబాటు

## ఆయుధాలు, డబ్బును అప్పగించిన మావోయిస్టులు

## డిజిపి శివధర్ రెడ్డి ముందు లొంగుబాటు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

మావోయిస్టుల లొంగుబాటు కొనసాగింది. మరికొందరు అగ్రనేతలు లొంగుబాటు పట్టారు. అగ్రనేత బర్సే సుక్కా అలియాస్ దేవా, తెలంగాణకు చెందిన రాజిరెడ్డి అతని భార్యతో పాటు 20 మంది సభ్యులు భారీగా ఆయుధాలు, నగదు అప్పగించి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. నిన్ననే లొంగిపోగా.. ఆ వివరాలను డీజీపీ శనివారం మీడియాకు వెల్లడించారు. మావోయిస్టు పార్టీ గెరిల్లా ఆర్మీ చీఫ్‌గా దేవా పని చేస్తున్నారు. లొంగిపోయిన వారి నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. హెలికాప్టర్లను కూల్చేందుకు వాడే సామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ లొంగుబాటు పీఎల్‌జీఏకు భారీ దెబ్బగా భావిస్తున్నట్లు చెప్పారు. దేవా.. హిడ్మా సొంత గ్రామానికి చెందిన వాడు. ఎన్ఐఏ నుంచి దేవాపై రూ.75లక్షల రివార్డు ఉంది. ఆవులం సోమా, భేమే, సుశీల, వేముల రాజు, నందయ్యా, మంకు, అండా, తెలంగాణ స్టేట్ కమిటీ సభ్యురాలు అడ్లూరి ఈశ్వరి లొంగిపోయినవారిలో ఉన్నారు. 2 పెణ, యూఎస్ఏ తయారీ కోల్ట్ ఆయుధంతో వచ్చారు. ఇజ్రాయెల్ దేశంలో తయారు చేసిన టవర్ ఆయధం కూడా ఉంది. ఎనిమిది ఏకే 47 గన్స్ స్వాధీనం చేసుకున్నాం. ÷ూఒఖీ 8, నాలుగు బ్యారెల్ గ్రానైడ్ లాంచర్స్ ఆయుధాలను సమర్పించారు. హెలికాప్టర్‌ను సైతం కూల్చే భారీ ఆయుధం సైతం తీసుకు వచ్చారు. పీఎల్‌జీఏ బెటాలియన్‌లో 400 మంది సభ్యులు ఉండగా.. ప్రస్తుతం 66 మంది మాత్రమే మిగిలారు. పీఎల్‌జీఏ పూర్తిగా క్షీణించింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా కిష్టంపేట్‌కు చెందిన రాజిరెడ్డి లొంగుబాటుతో ఇంకా రాష్ట్రానికి చెందిన ఒక్కరు మాత్రమే స్టేట్ కమిటీలో ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో మావోయిస్టులు ఆత్మ సమర్పణ చేసుకున్నారు. డివిజన్ సభ్యులకు రూ.5లక్షలు, ఏరియా సభ్యులకు రూ.4లక్షలు, మిగతా సభ్యులకు రూ.లక్ష రివార్డు ఉంది. రూ.1.80 కోట్ల రివార్డు లొంగిపోయిన మావోయిస్టులకు అందిస్తాం. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఇస్తాం. ఇప్పటి వరకు తెలంగాణలో 576 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పీఎల్‌జీఏ సమాచారం ప్రకారం ప్రస్తుతం తెలంగాణ నుంచి 17 మంది సభ్యులు మిగిలి ఉన్నారు. మిగిలిన మావోయిస్టులు కూడా లొంగిపోవాలని కోరుతున్నాం అని డీజీపీ తెలిపారు.

# ప్రక్కృథి వ్యవసాయం చేసే రైతులకు బాసట

## అదనంగా 4వేల ప్రోత్సాహం

## ఇవ్వాలన్న మాధవ్

విజయవాడ,

ప్రకృతి వ్యవసాయం చేసే వారికి అదనంగా రూ.4 వేలు ప్రోత్సాహకాలు ఇవ్వాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు. విజయవాడలో శనివారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై సహజ రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సేంద్రీయ వ్యవసాయ విధానంతో మంచి దిగుబడి సాధించిన అన్నదాతలను మాధవ్ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు మాధవ్. ప్రకృతి వ్యవసాయం చేసే వారి ఇబ్బందులు, కొత్త పద్ధతులు, ఆదర్శవంతమైన సాగుచేసే వారితో నేడు ఈ సదస్సు ఏర్పాటు చేశామని వెల్లడించారు పీవీఎన్ మాధవ్.ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా విజయవంతమైన రైతన్నల అభిప్రాయాలు, అనుభవాలు వివరించారని అన్నారు. ప్రకృతి వ్యవసాయ రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్దంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. జాతీయ, ప్రకృతి, సేంద్రీయ వ్యవసాయంపై అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఫసల్ భీమా, రైతులకు ఇన్‌పుట్ సబ్సీడీ ఇచ్చేలా భరోసా ఇచ్చారని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం చేసే వారిని అన్నివిధాలా ప్రోత్సహించాలని సూచించారు. దేశంలో ముప్పై శాతం మంది ప్రకృతి వ్యవసాయం రావాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని అన్నారు. ఆర్థిక స్వావలంబన కావాలంటే ప్రకృతి వ్యవసాయ విధానమే మార్గమని చెప్పుకొచ్చారు పీవీఎన్ మాధవ్. ఇతర దేశాలపై ఆధారపడి యూరియా, పురుగు మందులు కొనే విధానం ఆగిపోవాలని సూచించారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. రైతు బజార్లలో కొన్ని స్టాల్స్‌ను పెడుతున్నారని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన ఉత్పత్తులతో ప్రత్యేకంగా సంతలు, రైతు బజార్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయాలని కోరారు. కేంద్రం అమలు చేసే పథకాల గురించి అందరూ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందరూ ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లేలా ప్రోత్సహించాలని కోరారు. ఈరోజు సదస్సులో చేసిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివరిస్తామని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించాలని పీవీఎన్ మాధవ్ సూచించారు.

# పులుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

## వేటగాళ్లు ఉచ్చు బిగించకుండా చర్యలు

## అటవీ అధికారుల హెచ్చరికలు బేఖాతరు

ఆదిలాబాద్,



ప్రకృతిని పరిరక్షించుకునే క్రమంలో పులులను కూడా కాపాడుకోవాల్సి ఉంది. ఈ జాతని మనుగడ సాగించేలా పరిస్థితులు కల్పించాలి. పులులను ఉచ్చులో పడేసి చంపడం, కరెంట్ తీగల పెట్టడం లాంటి చర్యలు తీవ్రంగా పరిగణించాలి. 2016లో మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పిన్నారం అడవుల్లో వేటగాళ్ల ఉచ్చుకు మగపులి బలైంది. 2018లో తిప్పేశ్వర్ నుంచి ఆదిలాబాద్, కవ్వాల్ మీదుగా జైపూర్ మండలం శివ్వారం ఫారెస్ట్‌లోకి ప్రవేశించిన టైగర్‌ను కరెంట్‌షాక్‌తో చంపిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. 2014 జనవరిలో కాగజ్‌నగర్ ఫారెస్ట్ రేంజ్‌లోని దరిగాం సమీపంలో కే4, కే15 అనే రెండు పులులు స్థానికుల విషప్రయోగానికి బలయ్యాయి. ఈ ఏడాది కాగజ్‌నగర్ డివిజన్ పెంచికల్‌పేట రేంజ్‌లోని నల్లకుంట అటవీ ప్రాంతంలో వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఓ పులి చనిపోయింది. అనంతరం దాని చర్మం, గోళ్లు, పండ్లను ఎత్తుకెళ్లారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 24 గంటల పాటు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇటీవల రీంనగర్ రూరల్ మండలం బహదూర్‌ఖాన్‌పేట, చామన్‌పేట శివారులో పులి సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన రైతు పొలం వద్దకు వెళ్లగా.. ఒడ్డుపై జంతువు అడుగులు కనిపించాయి. అటవీశాఖ అధికారులు పొలం వద్దకు చేరుకొని అడుగుల గుర్తులు పులివేనని నిర్ధారించారు. బహదూర్‌ఖాన్‌పేటలోని ఓ మామిడితోటలో సైతం పులి అడుగులను గుర్తించారు. పులి సంచారంతో చామన్‌పల్లి, వెదురుగట్ట, చర్లబూత్కూర్, కొండాపూర్, ఐతరాజుపల్లి గ్రామాల ప్రజలు రాత్రి వేళ బయట తిరగొద్దని ఫారెస్ట్ ఆఫీసర్లు హెచ్చరించారు. ములుగు జిల్లా ప్రజలను పెద్ద పులులు కలవరపెడుతున్నాయి. రెండు రోజుల కింద మగ పులి, తాజాగా ఆడ పులి సంచారంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని అబ్బాపూర్ శివారు పంట పొలాల్లో పులి పాదముద్రలు గుర్తించినట్లు ఆఫీసర్లు తెలిపారు. మగపులి పందికుంట రేంజ్‌నుంతి సర్వీపూర్ మీదుగా వైల్డ్ లైఫ్ అటవీ ప్రాంతంలోకి వెళ్లిందని, సోమవారం వచ్చింది ఆడ పులి అని రేంజ్ ఆఫీసర్ డోలి శంకర్ తెలిపారు. పులుల సంచారంతో ములుగు, జాకారం, అబ్బాపూర్, పందికుంట గ్రామాల ప్రజలు, రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో పెద్దపులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు సంచరిస్తున్న అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

# బంగ్లాలో ఆగని దాడులు

## వరుస దాడుల్లో హిందువుల హతం

## తాజాగా మరో హిందూ వ్యాపారి మృతి



ఢాకా,

బంగ్లాదేశ్‌లో మరో హిందువు బలయ్యాడు..వరుస దాడులతో హిందువులు భయాందోళనలకు గురవుతున్నారు.బంగ్లాదేశ్ లో మరికొన్ని రోజుల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. వరుసగా హిందువులు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇటీవల ఖోకన్ చంద్ర దాస్(50) అనే వ్యాపారిపై కొందరు దుండగులు దాడి చేసి.. నిప్పంటించిన సంగతి తెలిసిందే. వారి నుంచి తప్పించుకునేందుకు నాడు చెరువులో దూకిన ఆయన.. తాజాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు స్థానిక మీడియాలో కథనాలు వస్తున్నాయి. చంద్రదాస్ క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం చేస్తున్నారు. ఇటీవల దుకాణాన్ని మూసి ఆటోలో ఇంటికి బయలుదేరగా.. మార్గమధ్యలో కొందరు దుండగులు ఆటోను ఆపారు. పదునైన ఆయుధాలతో చంద్రదాస్‌పై దాడి చేశారు. అనంతరం ఆయన తలపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. వారి నుంచి తప్పించుకునేందుకు రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూకేశారు. తర్వాత స్థానికులు ఆయనను కాపాడి.. ఆస్పత్రికి తరలించారు. తమకు శత్రువులు ఎవరూ లేరని, ఆయనపై ఎందుకు దాడి చేశారో తెలియదని ఖోకన్ భార్య సీమా దాస్ పేర్కొన్నారు. విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే దీపూదాస్ హత్య జరిగింది. కొన్ని రోజులకు సామ్రాట్ అనే వ్యక్తి గ్రామస్థుల మూక దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. అనంతరం బజేంద్ర బిశ్వాస్ అనే మరో వ్యక్తిని సహోద్యోగి కాల్చి చంపాడు. ఆ తర్వాత ఖోకన్‌పై దాడి జరగ్గా.. ఆయన తాజాగా మరణించాడు.

# ఏడాదిలో మచిలీపట్నం పోర్టు పూర్తి

## పోర్టు కనెక్టివిటీ కోసం రోడ్ల నిర్మాణం చేయాలి

## ఎంపి బాలశౌరితో కలసి పర్యటించిన మంత్రి కొల్లు

మచిలీపట్నం,

మచిలీపట్నం పోర్టు ఒక సంవత్సరంలో పూర్తి అవుతుందని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. పోర్టు కనెక్టివిటీ కోసం రోడ్ల నిర్మాణం చేయాల్సి ఉందని పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణా జిల్లాలో మచిలీపట్నం ఎంపీ బాలశౌరి, మంత్రి కొల్లు రవీంద్ర పర్యటించారు. పలు కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు. దాదాపు రూ.400 కోట్లతో పోర్టు కనెక్టివిటీ రోడ్డుకు శ్రీకారం చుట్టాలని అనుకుంటున్నామని తెలిపారు మంత్రి కొల్లు రవీంద్ర. పోర్టు కనెక్టివిటీ రోడ్డుకు ఎక్కడ ఫ్లైఓవర్, అండర్ పాసులు ఉండాలో అధికారులు ప్రణాళికలు వేస్తున్నారని చెప్పుకొచ్చారు. మచిలీపట్నం, విజయవాడ జాతీయ రహదారిని 6 లైన్లుగా విస్తరించాలని తమ ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. ఇందుకోసం రూ. 2 వేల కోట్లు ఖర్చవుతాయని వివరించారు. అవుటర్ రింగ్ రోడ్డుకు ప్రతిపాదన చేశామని తెలిపారు. విజయవాడ నుంచి గోశాల వరకు రోడ్డు విస్తరణ చేయాలని ఆలోచన చేస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి కొల్లు రవీంద్ర. పెడన, గుడివాడ ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో హైవేకు సంబంధించి కొన్ని ప్రతిపాదనలు చెప్పారని ప్రస్తావించారు. కత్తిపూడి, ఒంగోలు జాతీయ రహదారి 350 కిలోమీటర్లు ఉంటుందని వెల్లడించారు. ఈ రహదారికి తీర ప్రాంత గ్రామాలు తాళ్లపాలెం, గిలకలదిండి, కోడూరు ప్రాంతాలను కలపాలని ఎమ్మెల్యేలు చెప్పారని అన్నారు. తీర ప్రాంతాలను కలుపుతూ హైవే నిర్మాణం చేస్తే ఆయా గ్రామాల్లో కూడా అభివృద్ధి జరుగుతుందని మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. పామర్రు నుంచి చల్లపల్లి వరకు ఉన్న రహదారిని పీఎం గతి శక్తి ద్వారా అభివృద్ధి చేస్తామని తెలిపారు. 4 లైన్ల నుంచి 6 లైన్ల రహదారిని అభివృద్ధి చేసే క్రమంలో ఇప్పుడు ఉన్న సమస్యలు పరిష్కారం చేసేలా డీపీఆర్‌లో పెట్టాలని ఎమ్మెల్యేలు కోరుతున్నారని అన్నారు. కంకిపాడు నుంచి గుడివాడ వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన చేశామని వెల్లడించారు. ఆయా ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్నాయంటే దానికి అనేక కారణాలు ఉన్నాయని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# ఆర్వోబి పనులపై అపోహలు వద్దు

## సకాలంలో పూర్తి చేయించే బాధ్యత నాది

## కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

గుంటూరు,

శంకర్ విలాస్ ఆర్‌ఓబీ పనులను సకాలంలో పూర్తి చేస్తామని, ఎవరు కూడా అపోహలకు గురి కావద్దని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఆర్‌ఓబీ పనులపై ఎవరూ అపోహలకు గురి కావద్దని అన్నారు. సకాలంలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి అవుతుందని స్పష్టం చేశారు.శుక్రవారం గుంటూరు జిల్లాలో పెమ్మసాని పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబీని చెప్పిన సమయానికే పూర్తి చేస్తామని క్లారిటీ ఇచ్చారు. 2027 జూలైలోపే ఈ ఆర్‌ఓబీని ప్రారంభిస్తామని చెప్పుకొచ్చారు. జీజీహెచ్ వైపు 11 పిల్లర్లకుగాను 9 పూర్తి అవుతున్నాయని వెల్లడించారు. తాలూకా వైపు 5 ఫిల్లర్లు నిర్మించామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఒక సైడు పనులు పూర్తి చేసి రెండో వైపు నిర్మాణం చేస్తామని అన్నారు. ఈ పనుల దృష్ట్యా కార్మికుల సంఖ్యను పెంచి పనులు వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఆయా షాపుల యజమానులతో మాట్లాడి వారి సమస్యను పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. హైలెవెల్ క్రేన్లతో త్వరలో రైల్వేట్రాకుపై ఉన్న బ్రిడ్జిని తొలగిస్తామని అన్నారు. ల్యాండ్ ఎక్విజేషన్ కోసం కార్పొరేషన్ డబ్బు ఖర్చు చేస్తున్నామని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# అదుపు తప్పి బోల్తాపడ్డ బోటు

## కోనసీమ కలెక్టర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం

అమలాపురం,

అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు తృటిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం ఆత్రేయపురం మండలం పులిదిండి వద్ద డ్రాగన్ పడవ పోటీల ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కింగ్ బోట్‌పై ఆయన వెళ్తుండగా.. అది అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్ నీటిలో పడిపోయారు. లైఫ్ జాకెట్ వేసుకోవడంతో ఈ ప్రమాదం నుంచి ఆయన సురక్షితంగా బయటపడ్డారు. అనంతరం.. కలెక్టర్ మహేశ్ కుమార్‌ను మరో బోట్‌లో మత్స్యకారులు సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. ఆ తర్వాత యథావిధిగా అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాహుల్ మీనా, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో చిరుత సంచారం

## ఓ ఇంటి ముందు తచ్చాడినట్లు సిసి కెమెరాల్లో గుర్తింపు

శ్రీశైలం,

పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీశైలంలో చిరుత పులి కలకలం సృష్టించింది. ఓ ఇంటి ప్రాంగణంలోకి చొరబడింది. ఇంటి ఆవరణలో ఆహారం కోసం అటు, ఇటు తిరిగి వెళ్లిపోయింది. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సత్యనారాయణ అనే వ్యక్తి పాతాళగంగ మెట్లవైపు రేకుల షెడ్డు ఇల్లు కట్టుకుని జీవిస్తున్నాడు. ఆ ప్రాంతంలో చిరుతపులి తిరుగుతోందని సత్యనారాయణకు తెలిసింది. అప్రమత్తంగా ఉండేందుకు ఇంటి ఆవరణలో సీసీ టీవీ కెమెరాలు పెట్టించాడు. ఈ నేపథ్యంలోనే గురువారం అర్ధరాత్రి ఓ చిరుత సత్యనారాయణ ఇంటి ఆవరణలోకి చొరబడింది. అది ఆహారం కోసం ఇంటి ఆవరణలో కలియతిరిగింది. ఏమీ దొరక్కపోవటంతో అక్కడినుంచి వెళ్లిపోయింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఆ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సత్యనారాయణ ఇంటి దగ్గరకు చిరుత రావటం ఇది మొదటి సారి కాదు.. ఇంతకు ముందు ఓ సారి వచ్చింది. కృష్ణానది తీరం కావటంతో చిరుతలు పెద్ద ఎత్తున ఆ ప్రాంతంలో సంచరిస్తున్నాయి. నల్లమల్ల అడవుల్లో ప్రస్తుతం 87 పెద్ద పులులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

# గుడివాడలో టిడిపి నేతపై హత్యాయత్నం

## కత్తులతో హత్య చేయబోగా అడ్డుకున్న స్థానికులు

విజయవాడ,

గుడివాడలోని గుడ్‌మేన్ పేటలో టీడీపీ నేతపై హత్యాయత్నం జరిగింది. దీంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గుడ్‌మేన్ పేట సెంటర్‌లో టిడిపి నేత ఇమ్మాన్యుయేల్‌పై కత్తులు, రాళ్లతో మూకుమ్మడి దాడి చేశారు వైసీపీ వర్గీయులు. ఇమ్మాన్యుయేల్‌ను చంపేందుకు ప్రయత్నిస్తుండగా.. స్థానికులు అడ్డుకున్నారు. దీంతో వారిపైనా వైసీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇమ్మాన్యుయేల్‌తో సహా మరో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. స్థానికులు పెద్ద ఎత్తున ఘటనా స్థలికి రావడంతో వైసీపీ వర్గీయులు పారిపోయారు. గాయపడిన వారిని హుటాహుటిన గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. గత రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో వైసీపీ నేత రాజేష్‌తో స్వల్ప ఘర్షణ జరిగింది. దీనికి కొనసాగింపుగా ఈ దాడి జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన గుడివాడ టూ టౌన్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న కూటమి పార్టీల నాయకులు బాధితులను పరామర్శించారు. మరోవైపు హాస్పిటల్ ప్రాంగణానికి గుడ్‌మేన్ పేట వాసులు భారీగా చేరుకున్నారు.వైసీపీ నాయకుల నుండి తనకు ప్రాణహాని ఉందని టీడీపీ నేత ఇమ్మాన్యుయేల్ ఆవేదన వ్యక్తం చేశారు. 15 మంది వరకు తనపై దాడి చేశారన్నారు. వైసీపీ నేతలు రాజేష్, ఎలీషా ప్రోత్బలంతోనే ఈ దాడి జరిగిందని ఆరోపించారు. స్థానికులు స్పందించి అడ్డుకోకుంటే ఇమ్మాన్యుయేల్‌ను చంపేసేవారని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

# సంక్రాంతి రద్దీ దృష్ట్యా టోల్ వసూళ్లు ఆపండి

## కేంద్రమంత్రి గడ్కరీని కోరిన ఎంపి సనా సతీశ్

అమరావతి

సంక్రాంతి సందర్భంగా టోల్‌ప్లాజాలో టోల్ వసూళ్లను నిలిపివేయాలంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని టీడీపీ ఎంపీ సనా సతీష్ కోరారు. సంక్రాంతికి హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది ఏపీలోని సొంత గ్రామాలకు వస్తారని.. ఫలితంగా హైదరాబాద్–విజయవాడ రహదారిపై విపరీతమైన రద్దీ ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టోల్ వసూళ్లు నిలిపివేయాలని కేంద్రాన్ని కోరారు. సంక్రాంతి పండుగ కారణంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వాసులు పెద్ద ఎత్తున తమ తమ స్వస్థలాలకు వెళ్తుంటారని.. ఫలితంగా హైదరాబాద్–విజయవాడ రహదారిపై తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందన్నారు ఎంపీ సనా సతీష్. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పంతంగి, కొర్లపహడ్, చిల్లకల్లు, కీసర టోల్ ఎ÷–లాజాల వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతుందన్నారు. ఈ కారణంగా తెలుగు ప్రజలకు సమయం ఆదా అవ్వడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు టోల్‌ఎ÷–లాజాల వద్ద టోల్ వసూళ్లను మాఫీ చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు ఎంపీ సనా సతీష్. దీని వలన ప్రయాణం సాఫీగా జరిగి ఇళ్లకు క్షేమంగా చేరుకుంటారని అన్నారు. సంక్రాంతి పండుగను అందరూ సాంప్రదాయ బద్ధంగా జరుపుకునేందుకు అవకాశం కలుగుతుందని.. తమ విజ్ఞప్తిని పరిశీలించాలంటూ కేంద్ర మంత్రిని కోరారు ఎంపీ.

# ఈకేవైసీ నమోదు చేసుకోని 77వేలమంది

## అయినా ప్రతినెలా బియ్యం సరఫరా

కాకినాడ,

రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్నా..కొందరు మాత్రం ఎక్కడున్నారో తెలియడం లేదు. అయినా వారిపేరు మీద నెలనెలా రేషన్ సరఫరా జరిగిపోతోంది. ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.46 వెచ్చిస్తోంది. ఈ లెక్కన జిల్లాలో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న సభ్యులకు ప్రతినెలా రూ.1.64కోట్ల విలువైన బియ్యం సరఫరా చేస్తున్నారు. ఏడాదికి ఈ లెక్క రూ.20 కోట్లకు చేరుతోంది. కాకినాడ జిల్లాలో కార్డుదారులకు ప్రతినెలా 9,300 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీరిలో ఈకేవైసీ చేసుకోని 77వేల మందికి 385 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇదంతా పక్కదారి పట్టినట్లే.. ఇలా ఏడాదికి 4,620 టన్నుల బియ్యం అక్రమార్కుల పాలవుతోందని గుర్తిచారు. రేషన్‌కార్డుదారులు శాశ్వతంగా ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లినా, కుటుంబ సభ్యులు మరణించినా, ఇతర దేశాలకు వెళ్లిన వారికి యథావిధిగా ప్రభుత్వం ప్రతినెలా రేషన్ బియ్యం విడుదల చేస్తోంది. ఈ విధానంతో పెద్ద ఎత్తున సరకు పక్కదారి పడుతోందని, దీని అడ్డుకట్టకు కార్డులోని ప్రతి సభ్యుడు విధిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని కేంద్రం ఆదేశించింది. గత కొన్ని నెలలుగా జిల్లాలో ఈ పక్రియను ప్రారంభించారు. ఇప్పటికీ 77 వేల మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. వీరు ఎక్కడున్నారనే వివరాలు తెలియడం లేదు. అయినా కార్డులోని అందరికీ ప్రతీనెలా రేషన్ పంపిణీ మాత్రం జరుగుతోంది.రేషన్‌కార్డుల్లోని సభ్యుల ఈకేవైసీకి 2025, నవంబరు 30 వరకు గడువు ఇచ్చారు. అందరూ డీలరు, గ్రామ,వార్డు సచివాలయాల్లో తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకో వాలని సూచించారు. గడువులోగా ఈ పక్రియ పూర్తి చేసుకోకపోతే కార్డుల్లో వారి పేర్లు తొలగిస్తామని ప్రభుత్వం ఆదేశించింది. అయినా వీరంతా ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఫలితంగా ప్రతినెలా రూ.కోట్ల విలువైన బియ్యాన్ని అక్రమార్కులు భోంచేస్తున్నారు. అలాగే వరుసగా ఆరు నెలలు రేషన్ తీసుకోక పోయినా కార్డు రద్దుకు మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలో ప్రతినెలా 10 శాతం కార్డుదారులు సరకులు తీసుకోవడం లేదు. వీటిని ప్రభుత్వ గణాంకాలు రుజువు చేస్తున్నాయి. దీంతోనిజమైన లబ్దిదారులు ఉంటే.. ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకునేలా అధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

# భర్త ఆత్మహత్యపై మహిళ ఆందోళన

## కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా

కడప,

తన భర్త మృతికి సుధాకర్ నాయక్‌తోపాటు సీకే దిన్నె పోలీసులే కారణమని ఆరోపిస్తూ మహేంద్ర నాయక్ భార్య సౌజన్యతోపాటు జీజీఎస్ తండా వాసులు శుక్రవారం కడప డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ డీఎస్పీని వారు డిమాండ్ చేశారు. దీంతో కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కడప జిల్లా జీజీఎస్ తండాకు చెందిన మహేంద్ర నాయక్ గతంలో అప్పు చేశారు. ఆ అప్పు తీర్చాలంటూ అతడిపై అప్పు ఇచ్చిన వారు తరచూ ఒత్తిడికి గురి చేస్తున్నారు. వారి వేధింపులు తాళలేక.. జీజీఎస్ తండాకు చెందిన మహేంద్ర నాయక్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో తన భర్త మృతికి అప్పు ఇచ్చిన సుధాకర్ నాయక్, సీకే దిన్నె పోలీసులే కారణమని వారు ఆరోపిస్తున్నారు. తీసుకున్న అప్పు చెల్లించకుంటే చంపేస్తానంటూ సుధాకర్ నాయక్.. తన భర్తను బెదిరించాడని మహేంద్ర నాయక్ భార్య సౌజన్య తెలిపింది. తమకు న్యాయం చేయకుంటే .. ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీంతో డీఎస్పీ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు.

# తాడిపత్రి బాగు కోసమ దీక్ష చేసా

## తాడిపత్రి ఆదాయవ్యవయాలపై ఫ్లెక్సీ ఏర్పాటు

## మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి వెల్లడి

అనంతపురం,

తాడిపత్రి బాగుకోసమే దీక్ష చేస్తున్నానని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సర్కిల్‌లో ఉన్న గాంధీ విగ్రహం ఎదురుగా గురువారం ఆయన దీక్ష చేయడం జిల్లాలో సంచలనం రేకెత్తించింది. మున్సిపాలిటీ ఆస్తులను ప్రజలకు తెలపాలనే ఉద్దేశంతోనే దీక్ష చేపట్టానన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు దీక్ష చేసినట్లు ఆయన తెలిపారు. తాడిపత్రి మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయం ఎంత ఖర్చు ఎంత అన్న విషయం ప్రజలకు తెలపాలని ఫ్లెక్సీని ఏర్పాటు చేశామన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ ఎక్కడా లేదని చెత్తను గార్బేజీ వాహనాల్లోనే వేస్తున్నారన్నారు. 2026 సంవత్సరం చివరికల్లా తాడిపత్రిని నంబర్–1 మున్సిపాలిటీగా చేస్తానన్నారు. భూగర్భనీటి వ్యవస్థ ద్వారా వచ్చిన నీటిని శుద్ధిచేసి సమీపంలోని అర్జాస్ స్టీల్‌ఎ÷–లాంట్‌కు సరఫరా చేసి ఆదాయం సమకూర్చుతున్నామన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీకి 270ఎకరాలు ఆస్తి ఉందని వాటివిలువ దాదాపు రూ.2వేల కోట్లు అన్నారు. మున్సిపాలిటీ అ÷–దదెరూముల ద్వారా దాదాపు రూ. 3కోట్లు వస్తుందన్నారు. శానిటేషన్ ద్వారా మరో రూ.25లక్షలు వచ్చేలా వనరులను సమకూర్చుతున్నామని ఆయన పేర్కొన్నారు.


అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# విప్లవాత్మక నిర్ణయాలకు ఇదే సమయం !

**క్యాలెండర్లు మారుతూ ఉంటాయి. అయితే ప్రజల జీవితాలు ఏ మేరకు మారాయి..ఎంతమేరకు మనం చేసిన పాలన ప్రజల ఇతోధిక అభివృద్ధికి దోహదపడిందో అన్నది పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఏటేటా ప్రజల జీవనం చిధ్రం అవుతున్నా, సరైన నిర్ణయాలు తీసుకోక పోవడం వల్ల దేశం నానాటికీ దిగజారి పోతోంది. అన్ని రంగాలు కుదేలవుతున్నాయి. ప్రధానంగా విద్య,వైద్యరంగాల్లో పెనుమార్పులు ఏవీ కానరావడం లేదు. ఇదంతా కేవలం పాలకలు లోపభూయిష్ట నిర్ణయాల కారణంగానే చూడాలి. ప్రభుత్వాలు వస్తున్న ఆదయాలను అభివృద్ధి వైపు కాకుండా ఓటు బ్యాంక్‌కు ఉయోగపడే పథకాలకు మళ్లించడం వల్ల అప్పల్లో కూరుకుపోతున్నాం. దేశం యావత్తూ ఇదే పరిస్థితి ఉంది. సంక్షేమం పేరుతో చేస్తున్న విన్యాసాల కారణంగా పురోగమనం తగ్గింది. కనీసం రోడ్లు వేయలేని దురవస్థలు చూస్తున్నాం.తెలుగు రాష్ట్రాల్లోనూ పరిస్థితులు ఆందోళనకరంగానే ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుకానీ, ఉపాధి కల్పన కానీ ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగాలేవు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు ఏమాత్రం పెరగడం లేదు. మరోవైపు పరిశ్రమల పేరు చెప్పి, కార్పొరేట్లకు భూ సంతర్పణ కొనసాగుతోంది. గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రభుత్వ వైద్య రంగాన్ని కార్పొరేట్లకు అప్పచెప్పడానికి పాలకులు పరుగులు తీస్తున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే కుట్రలు ఆగలేదు. 2025లో జరిగిని తీరును చూస్తూ 2026లో ఏదో అద్భుతం జరుగుతుందని అనుకోవడానికి లేదు. నూతన సంవత్సరం 2026లోకి అడుగుపెట్టాం. గత కాలపు అనుభవాలు పాఠాలుగా మార్చుకోవడానికి, గుణపాఠాలు నేర్చుకుని ముందుకు అడుగు వేయడానికి ఇది సరైన సమయం! 2025వ సంవత్సరం మన ముందుంచిన కఠోర వాస్తవాలు నూతన సంవత్సరానికి స్పష్టమైన హెచ్చరికగా నిలుస్తున్నాయి.**

అసమానతలు ప్రమాదకర స్థాయికి చేరడం, నిరుద్యోగం తీవ్రమవ్వడం, కార్పొరేట్ దురాశలతో ప్రజల జీవనాధారాలు కుదేలవడం, పాలకుల రాజకీయాలు కార్పొరేట్ల లాభాల ఆశలతో జత కలవడం ఇవన్నీ గత ఏడాది సాధారణ ప్రజల జీవితాన్ని నేరుగా ప్రభావితం చేసిన అంశాలు. దేశ సంపదలో నలభై శాతం కేవలం ఒక్క శాతం మంది వద్ద కేంద్రీకృత మవ్వడం, మరోవైపు కోట్లాది మంది కూడు,గూడు,గుడ్డ,విద్య-వైద్యం వంటి మౌలిక అవసరాలు కూడా తీరని దుస్థితి నెలకొంది. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు దానికి భిన్నంగా తమ పాలన సాగిస్తున్నారు. విద్య, ఉపాధి రంగాలు అత్యంత దయనీయ స్థితికి చేరాయి. ఇప్పటివరకు అంతో, ఇంతో విశ్వాసం పొందిన న్యాయ వ్యవస్థ గత కాలపు ఖ్యాతి మసకబారుతుండటం ఆందోళనకర పరిణామం. నూతన విద్యావిధానం పేరుతో మూతబడిన బడులు మళ్లీ తెరుచుకోవాలని, చరిత్ర, విజ్ఞానశాస్త్రాలను పెంపొందించాలని, విద్యారంగం శాస్త్రీయ భావనలతో కొత్త పుంతలు తొక్కాలని, వేయి ఆలోచనలు వికసించి భావి తరాల ప్రగతికి బాటలు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజల జీవనోపాధికి గ్యారంటీ ఇచ్చే ఉద్యోగ, ఉపాధి రంగాలు కొత్త సంవత్సరంలోనైనా పూర్తిస్థాయిలో విరాజిల్లాలన్నది ప్రజల ఆకాంక్ష! గణాంకాల మాయాజాలం కాకుండా, తమ గౌరవాన్ని కాపాడే నిజమైన అభివృద్ధి జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఆర్థిక సంస్కరణలతో ఇప్పటికే అరకొరగా మారిన కార్మిక హక్కులను లేబర్‌కోడ్‌లతో పూర్తిగా దిగమింగడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఎపి రాజధాని అమరావతి నగర నిర్మాణం ఇంకా భూమి చుట్టే తిరుగోతంది. రెండేళ్లు కావస్తున్నా ఉన్న భూమితో సరిపెట్టుకోకుండా రియల్ వ్యాపారం వైపు చంద్రబాబు పరుగులు తీస్తున్నారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం వంటివి జవాబులేని ప్రశ్నలుగానే మిగిలాయి. ఈ వైఫల్యాలను ప్రశ్నించి, ప్రజలకు న్యాయం కోసం గళమిప్పే శక్తుల గొంతు నొక్కడానికి ప్రభుత్వం బరితెగించడం చూస్తున్నాం. ఇకపోతే దేశంలో దళితులు, ఆదివాసులు, మహిళలు ఎదుర్కొంటున్న దాడులకు ముగింపు పలికి, సమానత్వం నిజంగా అమలుకావాలన్నది ప్రజల ఆకాంక్ష. జల్, జంగల్, జమీన్‌పై కార్పొరేట్ ఆక్రమణలు ఆగాలి. అటవీ భూముల రక్షణ,



గిరిజనుల హక్కుల పరిరక్షణ జరగాలి. పట్టణాల్లో కాలుష్యం, కొండల విధ్వంసం, ప్రక తి వనరుల దోపిడీ వంటివి కేవలం పర్యావరణ సమస్యలు కావు. ఇవి జీవన, సామాజిక న్యాయ సమస్యలు. సామాన్యులను పట్టం కట్టే పర్యావరణ న్యాయంవైపు దేశం మళ్లాల్సింది. దేశ ఎన్నికల పక్రియ నూతన ఏడాదిలోనైనా నిజమైన, నిష్పక్షపాతపు ప్రజాస్వామ్యంగా మార్చాలి. దొంగ ఓట్లను, చోరబాటుదారుల ఓట్లను తొలగించాల్సిందే. అలాగే ఉచిత పథకాలను తగ్గించి, అభివృద్ధికి నిధులు వెచ్చించాలి. అదేపనిగా లెక్కుకు మించి పెన్షన్లు, తెల్ల రేషన్ కార్డులను తొలగించాలి. కొత్త సంవత్సరం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఆశావహ మలుపు తీసుకునేలా కార్యాక్రమాలను విస్తరించాలి. కేవలం పేదలకు మాత్రమే నేరుగా పథకాలు అందించాలి. దుబారా పథకాలను తగ్గించాలి. అప్పుడే దేశం బాబుపడగలదు.

## తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జనవరి 03: భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శనివారం సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య, ఇతర శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై, సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే బాలికా విద్యను ప్రోత్సహిస్తూ సమాజ అభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు. మహిళ సాధికారత, బాల్య వివాహాలు, సతీసహగమనం దురాచారాల నిర్మూలనకు కృషి చేశారని, సమాజ అభివృద్ధికి బాలిక విద్య ఆవశ్యకతను తెలియజేశారని తెలిపారు. బాల బాలికలను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అనిర్వచనీయమైనదని, విద్యార్థులను సన్మార్గంలో నడిపించే బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేలా ప్రోత్సహించాలని తెలిపారు. బాలిక విద్యకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థినులకు అవసరమైన సౌకర్యాలు కల్పించి విద్యను అభ్యసించేలా చైతన్య పరచాలని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు మధ్యాహ్న భోజనంలో మెనూను అమలు చేస్తూ పౌష్టిక ఆహారం అందిస్తుందని, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా గుణాత్మక విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడారంగంపై ఆసక్తి ఉన్న విద్యార్థులను ఆయా రంగాలలో ప్రోత్సహించి ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలని తెలిపారు. అనంతరం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన 10 మంది మహిళ ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మహిళా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక విస్తృత సవరణ లో భాగంగా రోజు వారీ ఎంట్రీల లక్ష్యాన్ని పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

అక్షరకలం ప్రతినిధి, నల్గొండ

ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ ఐ ఆర్ -స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) లో భాగంగా రోజు వారీ ఎంట్రీల లక్ష్యాన్ని నిర్దేశించుకొని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆర్డిఓ లతో మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా ప్రతి బిఎల్ఓ ప్రతి రోజు 40 ఎంట్రీలు చేయాలన్నారు. ఓటరు నమోదు, వచ్చే వారం డి ఎస్ ఈ పై దృష్టి పెట్టాలని అన్నారు. పెండింగ్ భూభారతి ఫైళ్ల పరిష్కారంలో భాగంగా ఆర్డిఓ లు పెండింగ్ ఫైళ్లను రెవెన్యూ అదనపు కలెక్టర్ కు పంపించాలని అన్నారు. భూ భారతి పై వచ్చేవారం తహసీల్దార్ లతో సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, ఆర్డిఓ లు వై. అశోక్ రెడ్డి, రమణారెడ్డి, శ్రీదేవి,తదితరులు ఉన్నారు.

## చదువుల తల్లి సావిత్రి భాయి పూలే కు నివాళులు అర్పించిన తీన్మార్ మల్లన్న టీం సభ్యులు

అక్షరకలం యాదాద్రి భువనగిరి

సామాజిక ఉద్యమకారిణి, చదువుల తల్లి సావిత్రి భాయి పూలే 196 వ జయంతి సందర్భంగా తీన్మార్ మల్లన్న టీం సభ్యులు శనివారం భువనగిరి పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద, సావిత్రి భాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుద్దుల సునీత, అఖిల్, హీరాలాల్, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ అక్షరాస్యతలో సావిత్రిబాయి పూలే కృషి ఎంతో అమూల్యం

అక్షర కలం : చిట్యాల

నల్గొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ ఆవుల సుందర్ విచ్చేసి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో మహిళలకు విద్య అందనంత దూరంలో ఉన్న కాలంలో బాలికల కోసం మహిళల అక్షరాస్యత కోసం ఎంతో కృషి చేసింది అని , బాలికల కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేసి మహిళలను బాలికలను విద్యావంతులుగా చేసింది అని అన్నారు భారతదేశంలో మొదటి పంతులమ్మ గా మారి నవ సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర చాలా ప్రాముఖ్యమైందని ఆమె ప్రపంచానికి తెలియజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అవార్డు గ్రహీత పొలిమేర దశరథ చిన్న కాపర్తి గ్రామ నూతన పాలకవర్గాన్ని సన్మానించారు .ఈ కార్యక్రమానికి ఉప సర్పంచ్ బెల్లంకొండ లావణ్య రఘు రుద్రారపు లక్ష్మణ్ పల్లపు పరమేశ్వరి ప్రశాంత్, ఈరమళ్ళ దయాకర్, వలిగొండ కవితా సత్యనారాయణ, రొండి నర్సింహ్మా , దేశపాక మధు, పెరిక రాజు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఆవుల మాధవి పొలిమేర దశరథ తదితరులు పాల్గొన్నారు..



## ట్రాక్టర్ బోల్తాపడి రైతు మృతి

అక్షర కలం, చిట్యాల

నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలో కాల్వ కట్టపై నుండి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రోజున ఏపూర్ గ్రామానికి చెందిన మందుల శ్రీశైలం (48) తను కౌలుకు చేస్తున్న పొలాన్ని దున్నేందుకని పొలం వద్దకు కాల్వ కట్ట వెంట వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడిపోయింది ఈ ప్రమాదంలో ట్రాక్టర్ కింద రైతు శ్రీశైలం పడడంతో తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మామిడి రవికుమార్ తెలిపారు.



## బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతి ఉత్సవాలు

అక్షరకలం - నల్గొండ

నల్గొండ పట్టణ కేంద్రంలో క్లాక్ టవర్ సెంటర్లో సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చక్రహరి రామరాజు, ప్రధాన కార్యదర్శులు నేలపట్ల సత్యనారాయణ లు మాట్లాడారు. మహిళా విద్యకు పునాది వేసి, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సావిత్రిబాయి పూలే గ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్, విశ్వనాథన్, టీఎన్జీఓ అధ్యక్షులు నాగిళ్ల మురళి, శేఖర్ రెడ్డి, కాశయ్య, రమ్య సుధా, సుమలత, భాస్కర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.




## మహిళా సాధికారతకు పాటుపడిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే - డాక్టర్ దాసి నాగరాజు

కుత్బుల్లాపూర్/ అక్షరకలం

మహిళా సాధికారతే జీవిత లక్ష్యంగా తన భర్త మహాత్మ జ్యోతిరావు పూలేతో కలిసి పని చేసిన గొప్ప సాంఘిక సంస్కర్త.. మహిళల చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, కారుణ్య వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ దాసి నాగరాజు అన్నారు. శనివారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిజాంపేట్ లోని వారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని.. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.




ఈ సందర్భంగా డాక్టర్ దాసి నాగరాజు మాట్లాడుతూ భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని, స్త్రీ విద్యా ఉద్యమ పితామహి మాతృమూర్తి సావిత్రిబాయి పూలే అని, స్త్రీలకు విద్య ద్వారానే సమానత్వం సాధ్యమని నమ్మి, సమాజంలోని అణచివేతలకు ఎదురొడ్డి విద్యా జ్యోతిని వెలిగించిన మహనీయురాలుసావిత్రిబాయి పూలే అన్నారు. సావిత్రి బాయి పూలే.. 1831లో జన్మించారని.. మహిళా సాధికారత కోసం తన జీవితాన్ని త్యాగం చేశారని, 1897లో అనారోగ్యంతో ఆమె మరణించారాని తెలిపారు. ఆమె చూపిన మార్గం నేటికీ మనకు ప్రేరణ అని, సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగిస్తూ.. విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం కలిసికట్టుగా మనమందరం నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పి. సుందర బాబు, కమలాకర్, సుహార్షిని, ప్రసాద్, శ్రావణి, పాండు, సందీప పాల్గొన్నారు.

## ప్రగతినగర్ విష్ణుప్రియ కాలనీ పార్క్ ను కాపాడి అభివృద్ధి చేయండి

ఆకుల సతీష్ ముదిరాజ్ బృందం డిమాండ్

కుత్బుల్లాపూర్/ అక్షరకలం

జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రగతినగర్ నందు విష్ణు ప్రియ లేఔట్ సర్వేనెంబర్157, 158 నందు పార్క్ స్థలాన్ని కాపాడి అభివృద్ధి చేయాలని ఆకుల సతీష్ ముదిరాజ్ బృందం శనివారం ఒక ప్రకటనలో మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆయన మాట్లాడుతూ 2020 లో మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడినప్పటి నుంచి ఈ పార్కు స్థలం కబ్జాలకు గురవుతుందని, మా ఫిర్యాదు మేరకు అప్పటి కమిషనర్ గోపి ఐఏఎస్ అధికారి కొంత కాపాడి ఫెన్సింగ్ వేయించడం జరిగిందన్నారు. తర్వాత కాలంలో అప్పటి బిఆర్ఎస్ నాయకులు ఆక్రమించి షాపులు నిర్మించుకోవడం కాకుండా పార్క్ స్థలం పూర్తిగా ఎలాంటి వినియోగంలో లేకుండా చెత్తాచెదారంతో మనుషులు వెళ్లకుండా ఉండడం జరిగిందని, కావున తక్షణమే పార్కు స్థలాన్ని మెజర్మెంట్ చేసి ,పార్క్ స్థలం కబ్జాలను తొలగించి, పార్కు మొత్తానికి ఫెన్సింగ్ వేసి రక్షించాలని, అభివృద్ధి చేసే ప్రజావినియోగంలోకి తేవాలని ఆకుల సతీష్ టీం శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్ రావు, ఈశ్వర్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.







అక్షరకలం
తెలుగు దినపత్రిక

# మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి ..జిల్లా కలెక్టర్ హనుమంతరావు


**అక్షరకలం యాదాద్రి భువనగిరి**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో వార్డుల వారిగా ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాను పునః పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని మినీ మీటింగ్ హల్ లో జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, పోలీస్, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో ఏలాంటి తప్పులు లేకుండా నూటికి నూరు శాతం పారదర్శకంగా ఉండాలని, ఈ నెల 1 న మున్సిపల్ వార్డుల వారిగా ప్రచురించిన ముసాయిదా ఓటరు జాబితాను మున్సిపల్ కమిషనర్లు, బి ఎల్ ఓలు, వార్డ్ ఆఫీసర్లు పునః పరిశీలన చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం ప్రచురించిన ఓటరు జాబితా ఈసీఐ ఆదేశాలకు మేరకు తయారు చేయాలన్నారు.ఆయా వార్డుల వారిగా రూపొందించిన ఓటరు జాబితాలో ఓటర్ల వివరాలు ఇంటి నెంబర్ల ప్రకారం ఉన్నాయో లేదో చూడాలన్నారు. ఒక వార్డులోని కుటుంబ సభ్యులు అదే వార్డులో ఉండేలా చూడాలని, ఒక వార్డులో నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువ



ఓటర్లు లేకుండా చూడాలని, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గుర్తించిన రిటర్నింగ్ అధికారులు చురుకుగా, పూర్తి అవగాహనతో ఉండేవారిని ఎంపిక చేయాలన్నారు. ప్రస్తుతమున్న ఓటరు జాబితాలో ఎట్టి పరిస్థితులలో సవరణకు అవకాశం లేదన్న విషయాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని ఆయన వెల్లడించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ముసాయిదా జాబితాను ప్రదర్శించాలని, అభ్యంతరాలను స్వీకరించి సకాలంలో వాటిని పరిష్కరించాలని, జనవరి 10వ తేదీన తుది ఓటరు జాబితా వెలువరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, సదుపాయాలను పరిశీలించాలన్నారు. అవసరమైన చోట కనీస సౌకర్యాలు కల్పించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ర్యాంపు వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు.ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఎలక్షన్ పోలీస్ అధికారులు శాంతి భద్రతల విషయంలో షెడ్యూల్ వెలువడిన నాటి నుండి, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అడిషనల్ యస్పి లక్ష్మీనారాయణ, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆట



## బీసీ విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**అక్షరకలం నల్గొండ**

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 196వ జయంతి జయంతి కార్యక్రమాన్ని బిసి విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా కేంద్రంలో మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ జిల్లా అధ్యక్షులు అయితగోని జనార్ధన్ గౌడ్ మాట్లాడుతూ చదువుల తల్లి సావిత్రిబాయి పూలే గారి 196 వ జయంతి శు భాకాంక్షలు తెలియజేస్తూ సావిత్రిబాయి పూలే ఒక సామాజిక సంస్కర్త, విద్యావేత్త,



కవయిత్రి అని కొనియాడారు. భారతదేశంలో మహిళల హక్కుల కోసం పోరాడడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. వాస్తవానికి, ఆమెను భారతదేశ స్త్రీవాద ఉద్యమ మార్గదర్శకురాలిగా పరిగణిస్తారు. కులం, లింగం ఆధారంగా ప్రజలపై వివక్ష అన్యాయమైన చికిత్సను రద్దు చేయడానికి ఆమె కృషి చేశారు. ఆమె ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆమని ఆదర్శంగా తీసుకొని సమాజం మార్పు కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, ఆమె భర్త జ్యోతిబా పూలేతో కలిసి మహిళలు, నిమ్న కులాల విద్య కోసం కృషి చేశారు. కుల వ్యవస్థ, సతీ సహగమనం వంటి సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా పోరాడారు, వితంతువుల పునర్వివాహాలకు మద్దతు ఇచ్చారు. అదేవిధంగా నల్గొండ జిల్లా కేంద్రంలో ఉన్న మహిళ డిగ్రీ కళాశాలకు సావిత్రిబాయి పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జి అజయ్ కుమార్ యాదవ్, టౌన్ ప్రెసిడెంట్ పుట్టా వెంకన్న గౌడ్, కోఆర్డినేటర్ చెన్నూరు భరద్వాజ్, వైస్ చైర్మన్ చిలక రాజు సతీష్, విద్యార్థి జేఏసీ వైస్ చైర్మన్ కొంపల్లి రామన్న గౌడ్, శ్రీనివాస్ యాదవ్, నరేష్ కుమార్, సౌజన్య, మమత, శృతి, పార్వతి, మహాలక్ష్మి, శిరీష, వెన్నెల, అనూష, పూజిత, త్రివేణి, లహరి, శోభ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

## బీసీ జాగృతి సేన ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు :- స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు :



**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి, 03)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు స్ఫూర్తి డిగ్రీ కళాశాల లో బిసి జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్ యాదవ్ మరియు నారాయణపేట జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్య నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే (1831–1897) భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త మరియు కవయిత్రి, ఆమె తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి బాలికల విద్య, అణచివేతకు గురైన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేశారు, 1848లో దేశంలోనే మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించి, కుల, లింగ వివక్షలకు వ్యతిరేకంగా, వితంతు వివాహాలు, కులాంతర వివాహాలకు మద్దతు ఇచ్చారు, ఆమె కృషి స్త్రీ విముక్తికి, సామాజిక సమానత్వానికి మార్గం చూపింది. అని అన్నాడు.తెలంగాణ ఉద్యమకారుడు కృష్ణ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేజీవితం, పోరాటాలు:విద్యకు ప్రాధాన్యత: ఆమె ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మారు, అని విద్యార్థులు మన ఆదర్శంగా తీసుకోవాలని మాట్లాడారు కళాశాల ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ 1848లో భర్తతో కలిసి పూణేలో బాలికల కోసం పాఠశాల స్థాపించి, భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా నిలిచారు. అని ప్రతి ఒక్క మహిళ ధైర్యంతో ముందుకు వెళ్తేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని కోరింది ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ , జిల్లా అధ్యక్షులు ఎడ్ల కుర్మయ్య , లు మాట్లాడుతూ కుల, లింగ వివక్షలకు వ్యతిరేకంగా పోరాటం ఆమె కృషి స్త్రీ విముక్తికి, సామాజిక సమానత్వానికి మార్గం చూపింది. ఆమె జీవితం, విద్యాబోధనకు అంకితం చేశారు. అని గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని వారి బాటలో నడవాలని కోరారు . ఉద్యమకారుడు కృష్ణ, మద్దూరు మండల అద్యక్షులు వెంకటయ్య, రాము, కృష్ణ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాలిక విద్యతో సమాజాభివృద్ధి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జనవరి 03**

:బాలికా విద్యతో కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శనివారం జిల్లాలోని కన్నెపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహశీల్దార్ రామచందర్, డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి లతో కలిసి హాజరై విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్



సభ్యులు మాట్లాడుతూ, బాలిక విద్య ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని తెలుపుతూ మహిళలు చదువుకునేందుకు విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే జయంతి రోజున విగ్రహావిష్కరణ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇల్లు బావుంటేనే సమాజం బాగుంటుందని తెలిపారు. సావిత్రిబాయి పూలే తన భర్త తో కలిసి బాల్య వివాహాలు, సతీసహగమనం లాంటి దురాచారాలను అరికట్టేందుకు అహర్నిశలు కృషి చేశారని, భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి పూలే అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. మహిళల సమస్యలను కేంద్ర దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని, మాలీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు ఎంపి లాడ్స్ నిధులనుండి సహకరిస్తానని తెలిపారు. ఉపయోగకరంగా ఉందని, తద్వారా రైల్వే శాఖకు ఆదాయం పెరిగిందని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## మధ్యాహ్న భోజనంలో మెనూ ఖచ్చితంగా అమలు చేయాలి..

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జనవరి 03:



ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థినీ, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనం మెనూ అమలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ, విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలతో పాటు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం, నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశంలోనే తొలి మహిళ ఉపాధ్యాయురాలిగా, సంఘ సంస్కర్తగా సావిత్రిబాయి అందించిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. విద్య అజ్ఞానాన్ని దూరం చేస్తుందని తెలియజేస్తూ బాలిక విద్యను ప్రోత్సహించారని, మహిళల హక్కుల కోసం తన వంతు కృషి చేశారని తెలిపారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ వారి ఆశయ సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రి భాయి పూలే జయంతి వేడుకలు

**అక్షర కలం, మందమర్రి జనవరి 03:**

సావిత్రి భాయి పూలే జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం పట్టణ యూత్ అధ్యక్షులు ముదారపు శేఖర్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో సావిత్రి భాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు నివాళులర్పించారు. అనంతరం యూత్ అధ్యక్షులు ముదారపు శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిళ్ల శ్రీనివాస్ లు మాట్లాడుతూ, స్త్రీ అభ్యుదయవాది, సంఘసంస్కర్త, సత్య శోధక మండలి సహ వ్యవస్థాపకురాలు, స్త్రీ విద్య, హక్కులకు కృషి చేసిన వీర వనిత, సామాజిక రుగ్మతలపై పోరాడి, అణగారిన వర్గాలకు అండగా నిలబడిన సావిత్రిబాయి పూలే సేవలను స్మరిస్తూ మహిళల పట్ల వివక్ష నెలకొడిన ఆరోజుల్లోనే మహిళల హక్కుల కోసం



కృషి చేస్తూ, ఈ దేశంలోనే మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టిన వారి స్ఫూర్తితోనే ఈరోజు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. పూలే దంపతుల ఆశయాలను కొనసాగిస్తూ బీసీల హక్కుల కోసం పోరాడుతామని, బీసీలకు విద్య, ఉద్యగ, ఉపాధి రంగాల్లో రిజర్వేషన్లు సాధించినప్పుడే వారి కల సాకారం అవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీసీల హక్కుల కోసం అట్రాసిటీ చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుందో అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా బీసీల హక్కుల కోసం వెనుకబడిన బీసీ వర్గాలకు రక్షణ కల్పిస్తూ, తెలంగాణ రాష్ట్రంలో కూడా బీసీలకు అట్రాసిటీ చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా యూత్ ఉపాధ్యక్షులు రాయబారపు కిరణ్, తడిగొప్పుల రవిరాజా, మడ్డి వేణుగోపాల్ గౌడ్, ఎండి కలీం, నల్లగొండ రమేష్, జె సత్యనారాయణ, చింతల రమేష్, నాగరాజు, అయాన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు జెర్సీలు అందజేత

**అక్షర కలం : చిట్యాల**

నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు ఆక్స్ఫర్డ్ స్కూల్ యాజమాన్యం శనివారం జెర్సీలను అందజేశారు. చిట్యాల పట్టణంలో జరుగుతున్న చిట్యాల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులకు పాఠశాల వ్యవహర్త పెద్ది నరేందర్ జెర్సీలను అందజేసిన అనంతరం మాట్లాడుతూ పట్టణ యువత చెడు దారులు పట్టకుండా తమ వ్యక్తిగత జీవితాలను స్థిర పరుచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఉద్యోగ, విద్యా విషయాల పట్ల అంకితభావంతో పని చేస్తే జీవితంలో విజయాలు సాధించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారు లు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు ఖలీల్, సుజన్, మహేష్, విజయభాస్కర్, సురేష్, నవీన్, అభిషేక్, గోపి, వెంకటేష్, చింటూ, మహేష్, మహి, ప్రదీప్ రవి, నరేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## సర్వేంద్రియానాం నయనం ప్రధానం

**మునుగోడు నియోజకవర్గంలో నిరంతరాయంగా ఉచిత కంటి వైద్యశిబిరాలు**

**ప్రతి ఒక్కరి కంటిచూపు మెరుగ్గా ఉండాలనే సంకల్పంతో ముందుకు**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**అక్షరకలం నల్గొండ**

తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కంటి సమస్యలతో బాధపడొద్దనే ఆలోచనతో ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు. ఇప్పటివరకు 10 విడతలుగా నిర్వహించిన ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలలో 7506 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 1490 మంది కి కంటి ఆపరేషన్లు పూర్తిచేశారు. మునుగోడు మండల ప్రజలకు మునుగోడు లో నిర్వహించి మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, రెండవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చండూరు మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన మూడవ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండలప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నాలుగో విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన ఐదవ విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి, చండూరు మండలం బంగారిగడ్డలో నిర్వహించిన ఆరవ విడత కంటి వైద్య శిబిరంలో 198 మందికి, గట్టుప్పల్ మండల కేంద్రం లో ఏడవ విడత కంటి వైద్య శిబిరంలో 65 మందికి, నారాయణపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన 8 వ విడత వైద్య శిబిరంలో 132 మందికి,చౌటుప్పల్ టౌన్ లో నిర్వహించిన 9 వ విడత వైద్య శిబిరంలో 82 మందికి, చౌటుప్పలో లోని లక్కారం లో నిర్వహించిన 10వ, విడత వైద్యశిబిరంలో 128 మందికి, ఆతరువాత చౌటుప్పల్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రివ్యూ క్యాంపుల్లో 32 మందికి ఆపరేషన్లు పూర్తి చేశారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి తల్లి, ప్రతి తండ్రి కి పెద్దకొడుకుగా మారి కంటి ఆపరేషన్ లు చేయిస్తున్నారు. రాబోయే మూడున్నర సంవత్సరాలలో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రణాళికలో భాగంగానే 10 పదివేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా టార్గెట్ పెట్టుకున్నారు. 19 జనవరి 2025 న మొదలైన ఈ ఉచిత వైద్య కంటి శిబిరాల నిర్వహణ నిరంతరాయంగా నియోజకవర్గంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 2 మున్సిపాలిటీలు , 7 మండల కేంద్రాలలో 10 ఉచిత వైద్య కంటి శిబిరాలు నిర్వహణ పూర్తయింది..ఈ 10 ఉచిత కంటి వైద్య శిబిరాలలో 7506 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 1490 మంది కంటి ఆపరేషన్లు పూర్తిచేసి, 2994 మంది కి కండ్లజోళు





(కండ్లద్దాలు) అందించారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో భాదపడొద్దని ఈ ఉచిత కంటి వైద్య శిబిరాల నిర్వహణ కొనసాగుతోంది.. దాంట్లో భాగంగానే నేడు మునుగోడు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో మునుగోడు, ఘట్టుప్పల్ మండలాల గ్రామాల ప్రజలకు 11వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి.మునుగోడు, ఘట్టుప్పల్ మండలాలలోని గ్రామాల ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఇప్పటికే గ్రామాలలో టామ్ టామ్ వేయించి ప్రచారం నిర్వాహిస్తున్నారు స్థానిక నాయకులు..ఈ ఉచిత కంటి వైద్యశిబిరాలలో పరీక్షలు చేయించుకుని ఆపరేషన్లకు ఎంపికైన పేషెంట్లను వెంటనే బస్సుల్లో హైదరాబాద్ తరలించి అక్కడి శంకరా కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించేలా ఏర్పాట్లు చేశారు.

**త్వరలోనే కంటి ఆసుపత్రి నిర్మాణం....**

ఉచిత కంటి వైద్య శిబిరాలలో పరీక్షలు నిర్వహించి ఆపరేషన్లకు ఎంపికైన వారిలో కొందరు మాత్రమే హైదరాబాద్ వెళ్లి ఆపరేషన్లు చేయించుకుంటున్నారు.ఆపరేషన్ అవసరం ఉండి కూడా కొంతమంది హైదరాబాద్ వెళ్లలేకపోతున్న పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే మునుగోడు మండల కేంద్రంలో నే కంటి పరీక్షలు నిర్వహించే విదంగా కంటి ఆసుపత్రిని నిర్మించడానికి ప్రణాళికలు వేస్తున్నారు.అన్ని సహకరిస్తే త్వరలోనే మునుగోడులో కార్పొరేట్ కంటి ఆసుపత్రి నిర్మాణం జరగనుంది.మునుగోడు నియోజకవర్గ ప్రజలకే కాకుండా నల్గొండ జిల్లాలోని మారుమూల గ్రామం నుండి కంటి సమస్యతో వచ్చినా చూసి వెంటనే ఉచిత ఆపరేషన్ చేసి పంపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# మహిళా విద్యకు సావిత్రిబాయి పూలే చేసిన సేవలు గొప్పవి:

అక్షరకలం నిర్మల్

ప్రముఖ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే 195 వ జయంతి వేడుకలను శనివారం సాయంత్రం కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ తన భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని గుర్తు చేశారు. విద్యను అభ్యసిస్తేనే స్త్రీ ఉన్నతి సాధ్యమవుతుందని గ్రహించిన సావిత్రిబాయి, సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా చైతన్యానికి బాటలు వేశారని అన్నారు. తద్వారా ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారని అన్నారు. అస్పృశ్యత, అంటరానితనం, కులవివక్షత వంటి సామాజిక రుగ్మతలను నిర్మూలించేందుకు పూలే



దంపతులు చేసిన పోరాటం, చూపిన తెగువ స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఆనాటి ఆధిపత్య వర్గాల సామాజిక కట్టుబాట్ల కారణంగా ఎన్ని అవాంతరాలు ఎదురైనా, వాటిని లెక్కచేయకుండా మహిళల విద్యాభివృద్ధికి అకుంఠిత దీక్షతో కృషి చేసిన ధీశాలి సావిత్రిబాయి పూలే అని ప్రశంసించారు. ఆ మహనీయురాలి స్ఫూర్తితో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేయాలని, అప్పుడే ఆమె ఆశయ సాధనకు కృషి చేసినట్లు అవుతుందని అన్నారు. సావిత్రిబాయి సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆమె జయంతిని పురస్కరించుకుని ప్రతియేటా జనవరి 3 వ తేదీన మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. బాలికలు పాఠశాలను మానివేయకుండా ఉండేలా ఉపాధ్యాయులు పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. బాల్యవివాహాలని నిర్మూలించేలా ఉపాధ్యాయులు సహకరించాలని తెలిపారు. బాలికలను చదువులో ప్రోత్సహించాలని పేర్కొన్నారు. బాలికల అక్షరాస్యతలో జిల్లాను ముందు వరుసలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమ గోడ ప్రతులను కలెక్టర్ చేతులమీదుగా ఆవిష్కరించారు. టిజిఆర్ఎస్ జెసి సోఫీనగర్ విద్యార్థిని శ్రీజ తాను గీసిన కలెక్టర్ చిత్రపటాన్ని అందించారు. విద్యార్థి ప్రతిభను కలెక్టర్ మెచ్చుకున్నారు. ఇటీవలి కేజీబీవీ నిర్మల్ విద్యార్థిని నక్షత్ర అంతర్జాతీయ ఆస్మిత ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక అవడంతో, విద్యార్థిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, డీఈవో భోజన్న, బిసి సంఘ నాయకులు డాక్టర్ ఉప్పు కృష్ణం రాజు, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

# తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

మందమర్రి/ చెన్నూరు జనవరి 03 అక్షర కలం ప్రతినిధి:

-మందమర్రి సింగరేణి మనోవికాస్ (మానసిక వికలాంగుల) పాఠశాలలో సావిత్రిబాయి పూలే 195వ, జయంతిని పురస్కరించుకొని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అధవాలే) పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగపిండి రమేష్ శనివారం కేక్ కట్ చేసి విద్యార్థులకు పెన్నులు, నోటు పుస్తకాలు, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం తుంగపిండి రమేష్ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే 1831లో మహారాష్ట్రలోని సతారా జిల్లా నయగాం గ్రామంలో జన్మించారు,



భారతదేశంలో దళితులు అనగారిన వర్గాల మహిళలపై ఎన్నో కఠినమైన ఆంక్షలు ఉన్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా మహాత్మ జ్యోతిబాపూలే తన జీవిత భాగ్యస్వామి అయిన సావిత్రిబాయి పూలేను చదివించి భారతదేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దారు, మహిళలు విద్యకు దూరంగా ఉండకూడదని ఆమె తన సొంత ఖర్చులతో మహిళా పాఠశాలలను నిర్మించారు, అగ్రవర్ణ కులస్తులు ఎన్ని అవమానాలు పరిచిన కృంగిపోకుండా వాటిని ఎదుర్కొని తన కర్తవ్యాన్ని నిర్వహించారు, సామాజిక సేవలో మహిళల హక్కుల కోసం మహిళలను చైతన్యపరిచి ఎన్నో ఉద్యమ కార్యక్రమాలను నిర్వహించారు, విద్యే శక్తి విద్యే విముక్తి అని ధైర్యంగా చాటి చెప్పారు. విద్య చరిత్రలో ఆమె ఒక మైలురాయి, వితంతు వివాహాలకు మద్దతును తెలిపారు, బాల్యవివాహాల వంటి అమానీయా సంప్రదాయాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయురాలే కాకుండా ఒక రచయిత్రి, ఆమె ఒక సామాజిక యోధురాలు. 1897లో ప్లేగు మహమ్మారి వచ్చినప్పుడు తన ప్రాణాలను పణంగా పెట్టి రోగులను తన భుజాలపై ఆశ్రయ కేంద్రాలకు తీసుకువెళ్లారు. ప్రజాసేవలోనే ఆమె ప్రాణాలను సైతం త్యాగం చేశారు. ఈరోజు మనం మహిళా సాధికారత, సమానత్వం, సామాజిక న్యాయం గురించి దానికి బలమైన పునాది వేసింది సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర కార్యదర్శి గుడికందుల తిరుపతి, జిల్లా అధ్యక్షులు ఎండి. రహమత్ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు గరిగే వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి దర్శనాల వెంకటస్వామి,జిల్లా నాయకులు పులిపాక శ్రీనివాస్, లక్కాకుల శ్రీనివాస్, మామిడిపల్లి ప్రకాష్, నాయకులు ఉప్పలేటి శంకర్, కొప్పుల సంజీవ్, రాధారపు శంకర్, భారతపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధికి చర్యలు

## పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జనవరి 03:భక్తుల సౌకర్యార్థం ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ తెలిపారు. శనివారం జిల్లాలోని జైపూర్ మండలం వేలాల లో గల గట్టు మల్లన్న స్వామి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించి మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ, గట్టు మల్లన్న స్వామి ఆలయ అభివృద్ధికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. మల్లన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా రోడ్లు, ఆలయ ప్రాంగణంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని, ఈ క్రమంలో రహదారి ఏర్పాటుకు అవసరమైన అటవీ శాఖ అనుమతుల ప్రక్రియ త్వరగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎంపి లాడ్స్ క్రింద నిధులు కేటాయించి ఆలయ పరిధిలో అభివృద్ధి



చర్యలు చేపడతామని, జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉంటామని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉప తహశీల్దార్, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ హయాంలో ఎపి కృష్ణాజలాల జలదోపిడీ

శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా తరలింపు

రోజుకు 13 టిఎంసిల నీరు తరలించుకుపోయిన ఎపి

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పట్టించుకోని బిఆర్ఎస్

చోద్యం చూస్తూ కూర్చున్న నాటి సిఎం కెసిఆర్

కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

బిఆర్ఎస్ హయాంలోనే ఎపి నీటి దోపిడీ జరిగిందని, అందుకు నాటి సిఎం కెసిఆర్ చూస్తూ ఊరుకున్నారని అసెంబ్లీలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి అక్రమంగా నీరు తరలిస్తుంటే బీఆర్ఎస్ సర్కారు చోద్యం చూసిందన్నారు. ఏపీ ప్రభుత్వం రోజుకు 13 టీఎంసీలు తరలించుకుపోయేలా ప్రాజెక్టును విస్తరించింది. జగన్ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతలు ప్రాజెక్టు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ కనీసం అభ్యంతరం చెప్పలేదన్నారు. తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాల హక్కులపై లఘు చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదీ జలాల విషయంలో గొప్పగా చేశామంటూ బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోందని విమర్శించారు. కృష్ణా నదీ జలాల్లో ఒక్క నీటి చుక్క కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ హక్కులను కాపాడటంలో ఎక్కడా రాజీపడబోమని తేల్చిచెప్పారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాయలసీమ ఎత్తిపోతలపై కేంద్రానికి ఫిర్యాదు చేశాం. పనులు నిలిపివేయించాం. 2024-25 సీజన్‌లో కృష్ణా జలాల్లో ఎక్కువ నీటిని వాడుకున్నాం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకు అంగీకరించి కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారు. కృష్ణా నదీ పరివాహకం ప్రకారం మనకు అధిక వాటా రావాల్సి ఉంది. మేం వచ్చాక 550 టీఎంసీలు కావాలని వాదించాం. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు కింద ఇంకా 39 వేల ఎకరాల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని ఉత్తమ్ తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై కేవలం 30 శాతం నిధులు



మాత్రమే ఖర్చు పెట్టారని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శాసనసభలో సాగునీటి ప్రాజెక్టులపై జరిగిన చర్చలో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం 2015లో జీవో ఇచ్చి 2022లో డీపీఆర్ సమర్పించిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు అనుమతుల కోసం పెట్టిన శ్రద్ధ పాలమూరు ప్రాజెక్టుపై పెట్టలేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు వాటర్ సోర్సును మార్చడం వల్ల తీవ్ర నష్టం జరిగిందని పేర్కొన్నారు. కాళేశ్వరంపై రూ.90వేల కోట్లు ఖర్చు చేసినవారు.. పాలమూరుకు రూ.27 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. పాలమూరు ప్రాజెక్టులో ఒక మోటార్ ఆన్ చేసి జాతికి అంకితం చేశామని ప్రకటించారు. కేసీఆర్ మోటార్ ఆన్ చేసిన తెల్లారే.. మళ్లీ ఆఫ్ చేశారు. కృష్ణా నది ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసింది. గత ప్రభుత్వం రూ. 40 వేల కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై అధిక మోజు చూపి.. పాలమూరును నిర్లక్ష్యం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి రోజుకు 3 టీఎంసీలు తరలించేలా అంచనాలు పెంచుకుంటూ పోయారు. పాలమూరులో మాత్రం 1.5 నుంచి ఒక టీఎంసీకి తగ్గించారు. జూరాల నుంచి అయితే రోజుకు 2.8 టీఎంసీలు తరలించే అవకాశం ఉండేది. 60 రోజుల్లో 121 టీఎంసీలు తీసుకునేవాళ్లం. వాటర్ సోర్స్‌ను జూరాల నుంచి శ్రీశైలానికి మార్చడం వల్ల 68 టీఎంసీల స్థాయికి పడిపోయింది. ఆయకట్టు కాల్వల ప్రస్తావన, భూసేకరణ లేకుండానే డీపీఆర్ రూపొందించారు. ప్రాణహిత - చేవెళ్లను తుమ్మిడిహట్టి నుంచి మార్చి గోదావరిలో అన్యాయం చేశారు. జూరాల నుంచి అయితే 22 పంపుల ఏర్పాటుతో ప్రాజెక్టు పూర్తయ్యేది. 414 మీటర్ల లోతు నుంచి నీరు తీసుకొనేవాళ్లం. శ్రీశైలానికి మార్చడం వల్ల పంపుల సంఖ్య 37కి పెరిగింది. దాదాపు 560 మీటర్ల లోతు నుంచి నీటిని ఎత్తిపోయాల్సిన పరిస్థితి వచ్చిందని ఉత్తమ్ వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే కృష్ణా జలాలపై తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని మంత్రి ఆరోపించారు. తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలుగా నీటి వాటాలపై బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే సంతకాలు చేశారని గుర్తుచేశారు. అంతేకాదు తెలంగాణకు కేవలం 34 శాతం నీళ్లు సరిపోతాయని కేసీఆర్, హరీష్ రావులు అంగీకరించారని విమర్శించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇరిగేషన్ పేరుతో రూ.1.80 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేశారని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 299 టీఎంసీలకు ఒప్పుకుని తెలంగాణకు మరణశాసనం రాసినట్లయ్యిందని మంత్రి మండిపడ్డారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు 783 టీఎంసీలు కేటాయించాలంటూ ప్రభుత్వం బలమైన వాదనలు వినిపిస్తోందని స్పష్టం చేశారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో దాదాపు 73 శాతానికి పైగా భూభాగం తెలంగాణలోనే ఉందని పేర్కొన్నారు. పాలమూరు - రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.83 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతోందన్నారు. ఇప్పటికీ మట్టి, కాంక్రీట్ పనులు మిగిలి ఉన్నాయన్నారు. మూడేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టులో కేవలం 35 శాతం పనులే జరిగాయని విమర్శించారు. కుర్చీ వేసుకుని కూర్చుంటా అని కేసీఆర్ అన్నారని, ఆ కుర్చీ ఎక్కడ పోయిందో, కేసీఆర్ ఎక్కడికి వెళ్లారో చెప్పాలని ఎద్దేవా చేశారు. మూడేళ్లలో పూర్తి చేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని మంత్రి ఆరోపించారు. కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు రూ.41 వేల కోట్లు, గోదావరి బేసిన్ ప్రాజెక్టులకు రూ.1.20 లక్షల కోట్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు పెట్టిందని ఉత్తమ్ వెల్లడించారు.

# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

నిబంధనలు పాటిద్దాం... ప్రాణాలు కాపాడుకుందాం


జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పిలుపు

జాతీయ రోడ్డు భద్రతా 2026 మాసోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నో హెల్మెట్ నో పెట్రోల్ నినాదంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

అక్షరకలం నల్గొండ






జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రజల ప్రాణాలను కాపాడాలనే ముఖ్య లక్ష్యంతో ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ఈ మాసోత్సవాల ప్రారంభ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్ పోస్టర్‌ను జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ నిర్లక్ష్యం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వల్లే జరుగుతున్నాయని, ప్రజలలో అవగాహన పెంపొందించడమే ఈ మాసోత్సవాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని విద్యాసంస్థలు, బస్సు స్టాండ్లు, ప్రధాన కూడళ్లు, మార్కెట్ ప్రాంతాలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో, ఆటో, లారి డ్రైవర్ లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు ద్వారా విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ వివరించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగి తలకు తీవ్ర గాయాలు తగిలి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మోటర్ వాహనాల చట్టం 1988 ప్రకారం హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరిగా అమలు చేయాలనే ఉద్దేశంతో నో హెల్మెట్ - నో పెట్రోల్ అనే నినాదాన్ని జిల్లాలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని పెట్రోల్ బంక్ యజమానులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించి, ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా ప్రజల ప్రాణాలు కాపాడుటలో మీ వంతు సహకారంగా హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులకే పెట్రోల్ అందించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించినట్లు ఎస్పీ తెలిపారు. కావున జిల్లాలోని ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, హెల్మెట్ లేకుండా పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్ అందించబడదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. అలాగే ప్రతి వాహనదారుడు సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అధిక వేగంతో వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, కాబట్టి అటువంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూనే, అవసరమైన చోట కౌన్సిలింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, అడిషనల్ ఎస్పి రమేష్, నల్లగొండ డిఎస్పీ శివరాం రెడ్డి, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి లావణ్య, ఎస్బి సీఐ రాము, 2టౌన్ సీఐ రాఘవరావు,1టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, డిటి ఆర్బి రిటైర్ సీఐ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల భాగంగా ఎంజేపీ విద్యార్థుల ర్యాలీ..

అక్షరకలం నిర్మల్

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కేంద్రంలో ఉన్న మహాత్మ జ్యోతి బాపులే విద్యార్థులు జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల భాగంగా పట్టణ కేంద్రంలో వేగం వద్దు ప్రాణం ముద్దు ..హెల్మెట్ పెట్టండి ప్రాణలను కాపాడుకోండి ప్ల కాడ్స్ తో నినాదాలతో ర్యాలీ నిర్వహించిన ఎం జె పి విద్యార్థులు...



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# సూర్యాపేట లో జరిగే మహాసభను జయప్రదం చేయండి

## మహాసభల గోడ ప్రతులు, కరపత్రాలు ఆవిష్కరణ

## టియు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ప్రపోల్ రాంరెడ్డి



**అక్షరకలం యాదాద్రి భువనగిరి**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న సూర్యాపేటలో జరిగే మహాసభను జయప్రదం చేయాలని టియు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ప్రపోల్ రాంరెడ్డి కోరారు. శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్ వి కాన్ఫరెన్స్ హాల్లో, జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మహాసభల గోడ ప్రతులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల మ్యానిఫెస్టో లో ప్రతీక తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులందరికీ 250గజాల ఇంటి స్థలముతో పాటు 25 వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. సూర్యాపేట లో జరిగే మహాసభకు యాదాద్రి భువనగిరి జిల్లా నుండి అధిక సంఖ్యలో ఉద్యమకారులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్,మోహన్ బైరాగి, బాకారం లావణ్య, జాంగిర్, రత్నపురం పద్మ,కొండాపురం శ్రీను, పొట్ట కిరణ్, మొలుగు లక్ష్మయ్య, కొండాపురం గణేష్, మట్ట ఆంజనేయులు, అవుశెట్టి రమేష్, సైదులు శంకరయ్య, పాల్గొన్నారు.

# బాలికల ఆత్మరక్షణే ధ్యేయం

## మాస్టర్ కారింగు రవీందర్

## రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షా శిక్షణ కార్యక్రమం



**అక్షరకలం, చండూరు**

ప్రస్తుత సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తూనే, తమను తాము రక్షించుకునే స్థాయికి ఎదగాలని ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షా శిక్షణ' కార్యక్రమం చండూరు, కనగల్లు మండలాల పరిధిలోని పలు పాఠశాలల్లో ఉత్సాహంగా కొనసాగుతోంది.?కరాటే మాస్టర్ కారింగు రవీందర్ ఆధ్వర్యంలో చండూరులోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కే.జీ.వి.బి), చండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్ ),కురంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు జీ.యడవల్లి పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాలల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ కారింగు రవీందర్ మాట్లాడుతూ... బాలికలు ఆపద సమయంలో భయపడకుండా ఎదురుదాడి చేసేలా మానసిక ధైర్యాన్ని, శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థినులకు ప్రాథమిక కరాటే మెళకువలు, పంచ్‌లు, కిక్కులు మరియు ఆకస్మిక దాడుల నుండి ఎలా తప్పించుకోవాలో ప్రయోగాత్మకంగా వివరిస్తున్నామన్నారు. మన దగ్గర ఉండే పెన్నులు, పుస్తకాలు లేదా బ్యాగులను ఆత్మరక్షణ ఆయుధాలుగా ఎలా వాడుకోవాలో నేర్పిస్తున్న, కేవలం శారీరక శిక్షణే కాకుండా, ఆపదలో ఉన్నప్పుడు సమయస్ఫూర్తితో ఎలా వ్యవహరించాలో అవగాహన కల్పించడం జరుగుతుందని తెలియజేశారు.

# నిర్మల్ జిల్లా గంగపుత్రుల ఐక్యత వేదిక మన వృత్తిని, మన ఉనికిని కాపాడుకుందాం

**నిర్మల్: అక్షరకలం**

చెరువునే నమ్ముకుని, అలలపై బతుకు ఈదుతున్న గంగపుత్రుడి బతుకు నేడు అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ, మన తలరాతలు మారడం లేదు. పాలకుల కుట్రలను ఛేదించాలంటే మన ఐక్యతే ఏకైక మార్గం" అని నిర్మల్ జిల్లా గంగపుత్రుల ఐక్యత వేదిక పిలుపునిచ్చింది.ప్రజాప్రతినిధులకు వందనం: మొన్నటి పంచాయతీ ఎన్నికల సమరంలో ఏ పార్టీ అన్నది చూడకుండా, మన జాతి గౌరవం కోసం స్వతంత్రంగా మరియు వివిధ పార్టీల నుండి బరిలోకి దిగి సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లుగా గెలిచిన ప్రతి గంగపుత్ర బిడ్డకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాం. ఓడిన వారు ఓటమిని అంగీకరించవద్దు.. అది మన గెలుపుకు పునాది మాత్రమే. మీరు చూపిన ఆ ధైర్యమే రేపటి మన జాతికి భవిష్యత్తు.పాలకులు మారుతున్నారు – జీవోల వేట సాగుతోంది: గత ప్రభుత్వం జీవో నంబర్ 6 తెచ్చి గంగపుత్రుల నోటికాడ కూడును లాక్కుంటే, ఈ ప్రభుత్వం మనకు అండగా ఉండి ఒక రక్షణ చట్టం తెస్తుందని ఆశపడ్డాం. కానీ, ఈ ప్రభుత్వం కూడా మరో కుట్రపూరిత జీవోతో మన



కులవృత్తిని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించడం దారుణం. గంగపుత్రుల పొట్ట కొడితే, ఆ గంగమ్మ తల్లి శాపం తగులుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.రాబోయే ఎన్నికలే మన సత్తాకు నిదర్శనం: అసలైన సత్తా రాబోయే ఎంపీటీసీ. జెడ్ పీటీసీ ఎన్నికల్లో చూపిద్దాం. మన దెబ్బ ఏంటో ప్రభుత్వానికి తెలిసేలా చేద్దాం. పార్టీ జెండాలు పక్కన పెట్టి, మన జాతి జెండాను గుండెల్లో మోద్దాం.2026 నూతన సంవత్సర కాంక్ష: వచ్చే ఏడాది మన బతుకుల్లో వెలుగులు నిండాలి. మన వృత్తికి చట్టబద్ధమైన రక్షణ సాధించే వరకు ఈ పోరాటం ఆగదు.

# రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

## నల్గొండ మున్సిపాలిటీలో పర్యటించి పారిశుధ్య నిర్వహణ పరిశీలన

## మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

## మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించాలని ఆదేశం

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**





మున్సిపల్ కమిషనర్లు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఉదయమే అయన నల్గొండ మున్సిపాలిటీలో పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. వార్డ్ నెంబర్ 28 (శ్రీ కృష్ణ నగర్) లో శానిటేషన్ సిబ్బంది చేస్తున్న మురికి కాలువల శుభ్రం, పారిశుధ్య పనులను పరిశీలించారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వీధులలో, రోడ్లపై ఎవరు చెత్త వేయకుండా చూడాలని, ఎవరైనా చెత్త వేస్తే జరిమానా విధిస్తామని చెప్పాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. వార్డు ప్రజలతో ఆయన ముఖాముఖి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ ఎలా ఉందని మిషన్ భగీరథ తాగునీరు సక్రమంగా వస్తున్నాయా లేదా అని వాకబు చేశారు. అనంతరం కమిషనర్ తో మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, అలాగే మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరాపై శ్రద్ధ వహించాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ యాదవ సంఘం భవనం వెనుక ఉన్న మోతికుంట బండ్ పునరుద్ధరణ కు అమృత్-2 పథకం కింద నిధులు మంజూరు కాగా బండ్ ను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఉన్నారు.

# సావిత్రిబాయి పూలే స్ఫూర్తితోనే భారత రాజ్యాంగంలో విద్యా హక్కు, సమానత్వ చట్టాలు

## మహిళా విద్య కోసం ఆమె చేసిన కృషి ఎనలేనిది

## రాష్ట్ర ప్రభుత్వం బాలిక విద్యకు ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పింది

## జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**





సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో మహిళా విద్యకు కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. సావిత్రిబాయి పూలే 159 వ జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్ఫూర్తితోనే భారత రాజ్యాంగంలో విద్యా హక్కు చట్టం, సమానత్వ చట్టాలు పొందుపరచడం జరిగిందని అన్నారు. ప్రత్యేకించి మహిళా విద్య కోసం ఆమె చేసిన కృషిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు మహిళ విద్యకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం బాలిక విద్యకు ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పిందని, అలాగే మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా బాలికలు మహిళల అభ్యున్నతికి కార్యక్రమాల నిర్వహణతో పాటు, బాలికలు మధ్యలోనే బడిమాని వేయకుండా చూడటం, మహిళా అక్షరాస్య పెంపు కై ఉల్లాస్ వంటి పథకాలను అమలు చేయడం జరుగుతున్నదన్నారు. 18 సంవత్సరాలు పైబడిన మహిళలు చదువు నేర్చుకునే విధంగా ప్రోత్సహించడం జరుగుతున్నదని, స్వయం సహాయక మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేసల్యాడం జరుగుతున్నదని,, మహిళలని చైతన్యం చేయాలన్న ఉద్దేశంతో సావిత్రి బాయి పూలే ను స్ఫూర్తిగా తీసుకొని వీటన్నిటిని అమలు చేస్తున్నారని, అందువల్ల సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని తెలిపారు.బ్రిటిష్ పరిపాలన కాలంలో అనేక రకాల సామాజిక రుగ్మతలు సమాజంలో ఉండేవని, సతీ సహగమనం, బాల్య వివాహల వంటి వాటిని వ్యతిరేకిస్తూ జ్యోతిబా పూలే చేపట్టిన సామాజిక ఉద్యమంలో సావిత్రిబాయి పూలే భాగస్వామి అయి సామాజిక కార్యకర్తగా పని చేశారని అన్నారు. ముఖ్యంగా విద్యకు ప్రధాన్యత ఇచ్చారని తెలిపారు. జ్యోతిబాపూలే స్థాపించిన "సత్యశోధన" ద్వారా దేశవ్యాప్తంగా మహిళా విద్య, సంఘసంస్కరణల పై అవగాహన కల్పించారని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళా విద్య కోసం చేసిన కృషిని కొనియాడారు. మహిళకు విద్య ఉన్నప్పుడే సామాజిక సమస్యలు తొలగిపోతాయని, సమాజాన్ని ఎదిరించి మహిళలను చదివించి విద్యాలయాలు ఏర్పాటు చేసి మహిళా అభ్యున్నతికి ఆమె పాటుపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకొని ప్రభుత్వం బాలికలకు ప్రత్యేక పాఠశాలలు, ఆత్మ రక్షణ కార్యక్రమాలను నిర్వహించారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు చక్రహరి రామరాజు, దుడుకు లక్ష్మీనారాయణ, మిర్యాల యాదగిరి, వెంకటేశ్వర్లు, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు పరమేష్, పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు.ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్ సన్మానించారు.

# నేటి తరానికి ఆదర్శం సావిత్రి భాయి పూలే జీవితం

## బాకారం లావణ్య, రత్నపురం పద్మ

**అక్షరకలం యాదాద్రి భువనగిరి**



చదువుల తల్లి, సామాజిక ఉద్యమకారిణి సావిత్రి భాయి పూలే జీవితాన్ని, నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు బాకారం లావణ్య, జిల్లా అధ్యక్షురాలు రత్నపురం పద్మ లు పిలుపునిచ్చారు. శనివారం భువనగిరి పట్టణ శివారులోని శ్రీ సాయి ప్రశాంతి విద్యా నికేతన్ పాఠశాలలో జరిగిన సావిత్రి భాయి పూలే 196 వ జయంతి వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. మొదట సావిత్రి భాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మండల విద్యాధికారి బండారు రవివర్ధన్ మాట్లాడుతూ సుమారు 180 సంవత్సరాల క్రితమే అమ్మాయిలు, మహిళలు చదువుకోవాలని, సుమారు 18 మహిళా పాఠశాలలు ఏర్పాటు చేసి చదువు చెప్పిన సావిత్రి భాయి పూలే భారతదేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలని కొనియాడారు. జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బర్రె సుదర్శన్ మాట్లాడుతూ బాల్యవివాహాల నిషేధానికి, వితంతు వివాహాలను ప్రోత్సహిస్తూ, సతీ సహగమనం కు వ్యతిరేకంగా పోరాడిన సావిత్రి భాయి పూలే చరిత్రను మరవకూడదు న్నారు. జిల్లా బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు ఎర్ర శివరాజ్ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు పూలే మరియు అంబేద్కర్ లాంటి మహానుభావుల త్యాగాల ఫలితమే దేశంలో "ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం" వచ్చిందన్నారు. నేటి బాలబాలికలు సావిత్రి భాయి పూలే ను స్ఫూర్తిగా తీసుకుని ఉత్తమ పౌరులుగా, ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే సావిత్రి భాయి పూలే, జ్యోతిరావు పూలే దంపతులకు



"భారత రత్న " తో గౌరవించాలని డిమాండ్ చేశారు. ఈ ఆదర్శ దంపతుల జీవితాన్ని పాఠ్యాంశం లో చేర్చాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ తోటకూర యాదయ్య మాట్లాడుతూ బాలబాలికలు చదువులో పోటీపడి ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. సమావేశంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ తోటకూర సంతోష, మహిళా ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జంక్షన్ల వద్ద ప్రమాదాల నియంత్రణకు చర్యలు...

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

15 రోజులలో జంక్షన్ల వద్ద ప్రమాదాల నియంత్రణ చర్యలు పూర్తి

ఏ.ఐ. సాంకేతికతో రాంగ్ సైడ్ డ్రైవింగ్, అతి వేగానికి చెక్

ఎన్టీఆర్ జంక్షన్ నుంచి వైరా రోడ్డు వరకు 10 ఫీట్ ఫుట్ పాత్ ఏర్పాటు

రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే 30 జంక్షన్ ల వద్ద ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో గత 3 సంవత్సరాలలో సుమారు 3200 పైగా ప్రమాదాలు జరిగాయని, 30 జంక్షన్ లలో 50 శాతం పైగా ప్రమాదాలు జరుగు తున్నట్లు గుర్తించామని తెలిపారు. జంక్షన్ల వద్ద రోడ్డు భద్రతా ప్రమాణాలు చేపడితే ప్రమాదాలు నియంత్రించవచ్చని అన్నారు. 30 జంక్షన్ల వద్ద వాహనాల వేగం తగ్గించేందుకు రంబుల్ స్ట్రిప్స్, లేన్ మార్కింగ్, రాత్రి వేళల్లో సరిగ్గా కనిపించేందుకు ఏర్పాట్లు, ఆక్రమణల తొలగింపు, జీబ్రా క్రాసింగ్, సైన్ బోర్డ్స్, బ్లింకర్స్ ఏర్పాటు వంటి చర్యలు రాబోయే 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్



ఆదేశించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల కార్యక్రమంలో 30 జంక్షన్ల వద్ద రోడ్డు భద్రతా చర్యలు చేపట్టడం ప్రాధాన్యతగా తీసుకోవాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలలో ఒక వ్యక్తి చనిపోతే ఒక కుటుంబం తీవ్రంగా ప్రభావితం అవుతుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క అధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టి జంక్షన్ ల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జంక్షన్ల వద్ద భారీ వాహనాలు టర్నింగ్ సమయంలో రోడ్డు ఆక్రమణల వల్ల ప్రమాదాలు అవుతున్నట్లు గుర్తించామని, వెంటనే అనుమతులు లేకుండా చేసిన నిర్మాణాలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు సైడ్ డస్ట్ వల్ల వాయు కాలుష్యం అధికం అవుతుందని, దీని నియంత్రణకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరంలో రోడ్ల ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. రోడ్లను ఆక్రమిస్తున్న పెద్ద, చిన్న వ్యాపారాలను తొలగించాలని అన్నారు. రోడ్లను ఆక్రమిస్తూ అనుమతి లేకుండా ఎటువంటి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. నగరంలో రోడ్లపై ఎక్కడ పార్కింగ్ చేయడానికి అనుమతించవద్దని, నో పార్కింగ్ ప్లేస్ లో పార్కింగ్ చేసే వాహనాలకు నిబంధనల ప్రకారం జరిమానా విధించాలని, తరచూ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారుల వాహనాలు సీజ్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఏఐ సాంకేతికతను వాడుతూ రాంగ్ సైడ్ డ్రైవింగ్, అతి వేగంగా ప్రయాణించే వాహనాలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి వైరా రోడ్డు వరకు 10 ఫీట్ ఫుట్ పాత్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో వీలైనంత మేరకు ఫుట్ పాత్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ నియంత్రించాలని కలెక్టర్ తెలిపారు. నగరంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ పోల్స్ కు పెయింటింగ్ వేయాలని, పని చేయని సిగ్నల్స్ ల మరమ్మత్తు



వెంటనే చేపట్టాలని, జనవరి 15 నాటికి జిల్లాలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ పూర్తి స్థాయిలో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వైన్ షాప్ ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత షాప్ ఓనర్ కు ఉంటుందని, రోడ్డు పై వాహనాలను పార్కింగ్ చేయరాదని అన్నారు. వర్షాకాలం అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ అద్భుతంగా పని చేసి గుంతల పూడ్చివేత కార్యక్రమం పూర్తి చేసిందని, ప్రస్తుతం లైన్ మార్కింగ్ చేస్తుందని, జిల్లాలోని ఇతర మున్సిపాలిటీలు కూడా గుంతల పూడ్చివేత పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టణాలలో మీడియన్ పై ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను 4 రోజులలో శుభ్రం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. స్కూల్ బస్సుల ఫిట్ నెస్ తో పాటు ఓవర్ లోడింగ్ కాకుండా చూడాలని అన్నారు. విద్యా సంస్థల బస్సు వెనక్కి రాష్ డ్రైవింగ్ చేస్తే ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలిపే ఫోన్ నెంబర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ ఎం. అపూర్వ, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్లు, పోలీస్, ఆర్ అండ్ బి., రవాణ, విద్యా శాఖ, నేషనల్ హైవే, మున్సిపల్, వైద్య, ఆరోగ్య శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 69 వ జాతీయ కబడ్డి పోటీలకు 33 జట్లు రిజిస్ట్రేషన్ పూర్తి : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జనవరి 3




పినపాక మండలం ఏడుళ్ళ బయ్యారం గ్రామంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాల నందు స్కూల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 69వ జాతీయ కబడ్డీ పోటీలు జనవరి 7వ తేదీ నుండి ఘనంగా ప్రారంభం కానున్నాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించబడు తున్న ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మరియు జాతీయ స్థాయి విద్యా సంస్థల నుంచి భారీ స్పందన లభించిందని ఆయన తెలిపారు. ఈ పోటీలు అండర్?17 బాలుర విభాగంలో నిర్వహించబడనున్నాయని, మొత్తం 33 జట్లు ఈ పోటీల్లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, బిహార్, అస్సాం, ఒడిశా, పశ్చిమ బెంగాల్, మణిపూర్, త్రిపుర, గుజరాత్, ఢిల్లీ, చండీగఢ్, పుదుచ్చేరి, ఉత్తరాఖండ్ రాష్ట్రాలతో పాటు దాద్రా ఉ నగర్ హవేలీ మరియు డామన్ ఉ డియూ కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయని వివరించారు. అదేవిధంగా కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కే వి స్), నవోదయ విద్యాలయ సమితి ( ఎన్ వి ఎస్ ), సీబీఎస్ఈ వెల్ఫేర్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్, సీఐఎస్సీఈ (ఐసీ ఎస్ ఇ), విద్యాభారతి వంటి జాతీయ స్థాయి విద్యా సంస్థల జట్లు కూడా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రతి జట్టు నుంచి 6 నుంచి 12 మంది క్రీడాకారులతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల నిర్వహణతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రీడా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందనుందని కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతి, భోజనం, త్రాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రత, రవాణా ఏర్పాట్లు తదితర అంశాలపై పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ జాతీయ క్రీడా ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో మరింత పెంచేలా సంబంధిత శాఖలు, నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు.

## మేనిఫెస్టోలో పెట్టిన వాగ్దానాన్ని అమలు చేయమని అడుగుతే అక్రమ అరెస్టులా

ఆటో కార్మికుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాముబి ర్ టి యు జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్, ఆటో జె ఏ సి నాయకులు

అక్షర కలం సిద్దిపేట జనవరి 03..




మహాలక్ష్మి పథకంతో రోడ్డున పడ్డ ఆటో కార్మికులను ఆదుకోవాలని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రతి ఆటో డ్రైవర్ కి నెలకు జీవన భృతి కింద ఇస్తామన్న ఆర్థిక సహాయం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన ఆటో జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శాంతియుతంగా వెళ్తున్న కార్మికులను అరెస్టు చేయడం దారుణం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 32 మంది ఆటో డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్యలకు పాల్పడ్డారని వారి కుటుంబాలకు పది లక్షల ఎక్స్ గ్రేసియ చెల్లించాలని మహాలక్ష్మి పథకంతో నష్టపోతున్న ఆటోడ్రైవర్లకి జీవన భృతి కింద నెలకు 20వేల రూపాయలు ఇవ్వాలని మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఆటో డ్రైవర్లకి రాష్ట్రంలో ప్రత్యేక కార్పొరేషన్ను ఏర్పాటు చేసి తద్వారా అర్హులైన కార్మికులకి సంక్షేమ పథకాలను అందే విధంగా చూడాలని కోరారు. ఉన్నత చదువులు చదివి ఉపాధి లేక కుటుంబ జీవనం గడపడానికి ఫైనాన్స్ లో ఆటోలు తీసుకొని నడుపుతున్న కార్మికులపై మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా రాష్ట్ర ప్రభుత్వం విధానాలు ఉన్నాయని అన్నారు.. ఆటో కార్మికుల కు ఇచ్చిన హామీలు వేంటనే నెరవేర్చాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమం లో బి ఆర్ టి యు పట్టణ అధ్యక్షుడు బాయికాడ శ్రీనివాస్ సంజు ఆటో వెల్ఫేర్ సొసైటీ ఇంచార్జ్ ఆకుల తిరుపతి పట్టణ క్యాషియర్ జి కిషన్ ముస్తాబాద్ చౌరస్తా ఆటో అధ్యక్షుడు బాలరాజ్ చంద్రారెడ్డి అడ్డా అధ్యక్షులుయం డి బాబా షాదుల్ మరియు ఆటో డ్రైవర్లు కర్రోళ్ల పరశురాములు, మహమ్మద్ సాజిద్, ఎస్ మధు, కరుణాకర్, నాగరాజ్ మరియు ఇతర ఆటో డ్రైవర్లు పాల్గొనడం జరిగింది.

## అయ్యప్ప స్వామి పడి పూజలో పాల్గొన్న వంగ రాజేశ్వర్ రెడ్డి

అక్షర కలం సిద్దిపేట జనవరి 03 :




సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండలం అల్లీపూర్ గ్రామ సర్పంచ్ మణెమ్మ, చంద్రశేఖర్ కత్తి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమంలో వంగ రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖశాంతులతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ పడి పూజ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కలెక్టర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ఎంఆర్పిఎస్ నాయకులు

అక్షరకలం యాదాద్రి భువనగిరి

యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎం ఆర్ పి ఎస్) రాష్ట్ర నాయకులు శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ను మర్యాద పూర్వకంగా కలిసి శ్రీ యాదగిరి లక్ష్మి నరసింహ స్వామి ప్రసాదం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. 2026 నూతన సంవత్సరంలో జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని కలెక్టర్ ను కోరారు. జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఎం ఆర్ పి ఎస్ నాయకులతో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను ఆత్మీయంగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మిసాల ఉప్పలయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి బొట్ల శంకర్, రాష్ట్ర, జిల్లా నాయకులు చల్లూరి యాదగిరి, గోపి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ హైమావతి

అక్షర కలం, సిద్దిపేట్ జిల్లా ప్రతినిధి, జనవరి 3 :



జిల్లాలోని కొమురవెల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా కలెక్టర్ హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొమురవెల్లి జాతర నేపథ్యంలో ప్రతి ఆదివారం ప్రత్యేక ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చెయ్యాలని తెలిపారు. అటెండెన్స్ ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. ఓపి రిజిస్టర్ రాయడంలో పలు సూచనలు చేశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీసి సిబ్బంది, మెడిసిన్, పరీక్షలకు సంబంధించి ఎలాంటి సదుపాయాలకైన డిఎం అండ్ హెచ్ ఓ దృష్టికి తీసుకురావాలని సిహెచ్ సి కి వచ్చే రోగులకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఫార్మసీ స్టోర్ కి వెళ్ళి మందుల తనిఖీ చేశారు. కాలం చెల్లిన మందులు వాడకూడదని అన్ని మందులు ఎక్కువ మొత్తంలో ఉండాలని తెలిపారు. పి ఎచ్ సి లో శిక్షణ కోసం వచ్చిన నర్సింగ్ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతూ పుస్తకాల్లో చదివిన జ్ఞానాన్ని నేరుగా చూస్తూ మంచి శిక్షణ పొందాలని ప్రజలకు మంచి వైద్యం అందించాలని తెలిపారు.

## చందూరు హైస్కూల్‌లో ఘనంగా 'ఫుడ్ ఫెస్ట్ 2026'

నోరూరించిన విద్యార్థుల వంటకాలు

సంప్రదాయ ఆహారమే ఆరోగ్యానికి శ్రేయస్కరం

హెచ్ఎం కోటేశ్వర్ రెడ్డి

అక్షరకలం,చందూరు





చందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 'ఫుడ్ ఫెస్ట్–2026'ను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. పాఠశాలలోని వృత్తి విద్యా కోర్సులైన బ్యూటీ అండ్ వెల్‌నెస్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సంప్రదాయ, ఆధునిక వంటకాలు చూపరులను, రుచి చూసిన వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.? ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. కోటేశ్వర్ రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలంలో పిల్లలు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ,భారతీయ సంప్రదాయ వంటకాలను తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. విద్యార్థులు రుచికరమైన వంటకాలను తయారు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## కేజీబీవీ స్కూల్లో ఏడవ తరగతి విద్యార్థిని అనుమానాస్పద మృతి

అక్షర కలం సిద్దిపేట,జనవరి 03:



సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి? ఎల్లుపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఏడవ తరగతి చదువుతున్న హర్షిని అనుమానాస్పదంగా మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. శుక్రవారం రాత్రి పాఠశాల హాస్టల్‌లో హర్షిని కదలకుండా ఉండటాన్ని గమనించిన తోటి విద్యార్థులు వెంటనే సిబ్బందికి సమాచారం అందించారు. అప్రమత్తమైన సిబ్బంది ఆమెను హుటాహుటిన ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై హర్షిని తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డ ఎలా మృతి చెందిందో తమకు స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెజ్జంకి మండలం కల్లేపల్లి



గ్రామానికి చెందిన హర్షిని తండ్రి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ నా బిడ్డ పూర్తిగా ఆరోగ్యంగా ఉంది. సోమవారం వచ్చి చూసినప్పుడు కూడా ఎలాంటి సమస్య కనిపించలేదు. ఇంతలో ఇలా ఎలా జరిగిందో అర్థం కావడం లేదు అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.బంగారు లాంటి నా బిడ్డ ఇక నాకు దక్కదు అంటూ ఆయన చెప్పిన మాటలు అక్కడున్న వారిని కంటతడి పెట్టించాయి. పాఠశాల వద్ద తల్లిదండ్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో చేరుకుని విలపించడం హృదయవిదారకంగా మారింది. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు వెల్లడించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశముందని తెలిపారు. ఈ ఘటనతో పాఠశాల పరిసరాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.



# కష్టాల్లో ఉన్నవారికి 'మనోజ్' ధైర్యం

**మృతుడి కుటుంబానికి... రోగులకు ఆర్థిక భరోసా**

**మానవత్వాన్ని చాటుకుంటున్న 'మీ శ్రేయోభిలాషి బృందం'**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం : కష్టాల్లో ఉన్నామన్న పిలుపు విన్నా.. కన్నీరు పెడుతున్న దీన గాథ కంటపడ్డా..





'మేమున్నాం' అంటూ ఆపన్నహస్తం అందిస్తోంది 'మీ శ్రేయోభిలాషి బృందం'. బండి మనోజ్ కుమార్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సాగుతున్న ఈ సేవా ప్రస్థానం పలువురి జీవితాల్లో వెలుగులు నింపుతోంది. శనివారం ఖమ్మం 60వ డివిజన్ లోని రామన్నపేట, రామన్న పేట కాలని పరిసర ప్రాంతాల్లో పలువురు బాధితులకు వారు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.– మేమున్నామనిరామన్నపేట కాలనీకి చెందిన బానోతు శ్రీను గత గురువారం అకస్మాత్తుగా మరణించడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. విషయం తెలుసుకున్న బృందం శనివారం వారి నివాసానికి వెళ్లి పరామర్శించింది. బండి మనోజ్ కుమార్ తన వంతుగా రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందించి ఆ కుటుంబానికి భరోసానిచ్చారు.

**ఆస్పత్రిలో పరామర్శ..**

వైద్యానికి తోడ్పాటుఖమ్మం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరభద్రం కుమారుడు నవీన్‌ను మనోజ్ కుమార్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు పరామర్శించారు. మెరుగైన వైద్యం పొందేందుకు తక్షణ ఖర్చుల నిమిత్తం రూ. 5,000 నగదును అందజేశారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న రుంజా అశోక్‌ను పరామర్శించి రూ. 5,000 సాయంతో పాటు దుప్పటిని అందించారు.

**వృద్ధులకు వెచ్చని ఆసరా**

చలికి వణుకుతున్న వృద్ధులను చూసి చలించిన మనోజ్ కుమార్ రామన్నపేటలోని వయోవృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే అనారోగ్యంతో సతమతమవుతున్న షేక్ హిమామ్ సాబ్ కు నెలకు సరిపడా మందులు గరిడేపల్లి వెంకటేశ్వర్లుతో కలిసి సమకూర్చడంతో పాటు రూ. 2,000 నగదును అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

## సీల్డ్ కొటేషన్లకు ఆహ్వానం.. కలెక్టర్ జితేష్, వి. పాటిల్

**అక్షర కలం/భద్రాచలం**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కృష్ణ సాగర్ ప్రభుత్వ ఐటీఐకి వివిధ కోర్సులకు అవసరమైన రా మెటీరియల్ ముడి సరుకులు కొనుగోలుకు సంబంధించి జిఎస్టి నమోదు కలిగిన అర్హత గల సంస్థల నుండి సీల్డ్ కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఐదు నుంచి పదో తేదీ వరకు ప్రభుత్వ ఆర్ ఐ టి ఐ కృష్ణ సాగర్ ప్రిన్సిపాల్ సంచాలకుల కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సులో సీల్డ్ కొటేషన్లను వేయాలని సూచించారు. ఐటీఐకి. మూడు లక్షల డెభై తొమ్మిది వేల రెండు వందల రూపాయల బడ్జెట్ కేటాయించి, మెకానికల్ ట్రేడ్ నలభై తొమ్మిది రకముల పదార్థములు, ఎలక్ట్రికల్ ట్రేడ్ ఎనభై రకముల ముడి పదార్థములు కొనుగోలు చేయడానికి కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఆర్ ఐ టి ఐ కృష్ణ సాగర్ కార్యాలయం ఫోన్ నెంబర్ 89 1999 61 618 ఫోన్ చేసి తెలుసుకోవాలని ఆయన సూచించారు. జీఎస్టీ నమోదు కలిగిన సంస్థలు మాత్రమే కొటేషన్ సమర్పించాలన్నారు. ట్రేడ్ కోర్సుల వారీగా రా మెటీరి యల్ జాబితాను సంబంధిత ఐటీఐ ప్రిన్సిపల్ నుంచి పొందాలని వివరించారు. నిబం ధనల ప్రకారం తక్కువ ధర పేర్కొన్న సంస్థను సరఫరా ఆర్డర్ల కోసం పరిగణిస్తారని ఆయన అన్నారు.

### సింగ్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు.

**అక్షర కలం / ఇల్లెందు.**

సావిత్రిబాయి పూలే 195వ జయంతిని పురస్కరించుకొని ఇల్లందులో బీసీ సంఘం సింగు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల దండలు వేసి ఘనంగా 195వ జయంతి వేడుకలను ఇల్లందు టైలర్స్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జై భారత్ బిసి పోరాట వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలిమి శెట్టి వీరన్న, కీన్ టైలర్ సింగు నాగేశ్వరరావ్ మాట్లాడుతూ ఆనాటి అగ్రకులాల చాందస వాదుల జమిందారుల ఆగడాలకు వ్యతిరేకంగా దేశంలోనే సావిత్రిబాయి పూలే మొట్టమొదటి పాఠశాలను ఏర్పాటు చేసి మహిళలు బయటకు వెళ్లలేని రోజులలో కూడా ఆమె మొక్కవోని ధైర్యం చేసి దళిత వాడ పిల్లలకు, మహిళలకు చదువు చెప్పడం జరిగిందన్నారు.ఎంతో మంది ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టినప్పటికీ ధైర్యంతో పిల్లలకు చదువు చెప్పడం జరిగిందని,ఆమెను ఈ రోజులలో కూడా దేశంలోనే మొట్టమొదటి మొదటి పంతులమ్మగా గుర్తిస్తారన్నారు. ఈనాడు రాష్ట్ర ప్రభుత్వము గుర్తించి సావిత్రిబాయి పూలే పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమం లో టైలర్ వాడపల్లి భాస్కర్, బి ఆర్ ఎస్ నాయకులు పరుచూరి వెంకటేశ్వర్లు, గట్ల అశోక్ వె న్ను నాగులు, రాజారాం,ఎస్ కే జానీ,కోడేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఇల్లెందు పట్టణాన్ని అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీదే

**మునిసిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సంసిద్ధంగా ఉన్నాం**

**పలు వార్డుల పర్యటనలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్, గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్.**

**అక్షర కలం / ఇల్లెందు.**



ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 3,4,5,6 వార్డులలో శనివారం ఇల్లందు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జి బానోత్ హరిప్రియ నాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇల్లందు మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సంసిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు.ఇల్లందు మున్సిపాలిటీలోని 24 వార్డులను అభివృద్ధి చేసిన ఘనత బిఆరెస్ పార్టీదే నని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్నికలు ఎప్పుడు సమీపించిన బిఆర్ఎస్ పార్టీ ముద్దుబిడ్డలు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. పట్టణంలోని 3,4,5,6వార్డులలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, వార్డులలో గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య తాగునీటి ఎద్దడిని నివారించడం జరిగిందని, వార్డులలోని ప్రతి గల్లీ గల్లీకి కూడా సిసీ రోడ్డు తో పాటు, సైడ్ డ్రైనేజీలు, ప్రధాన కూడళ్లలో లైటింగ్ వ్యవస్థను నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. ఇల్లందు ప్రధాన రహదారి తో పాటు బస్ డిపోను కూడా అందుబాటులోకి తీసుకొని రావడం జరిగిందని ఆనాటి తొలి ముఖ్యమంత్రివర్యులు కేసీఆర్ సహకారంతో, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహకారంతో, ఆరోగ్య శాఖ మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు సహకారంతో ఇటు వైద్య రంగంలోనూ,పట్టణ అభివృద్ధి లోను, అన్ని రంగాలలో ఇల్లందు మున్సిపాలిటీని అభివృద్ధి పరిచడం జరిగిందని, ముఖ్యంగా ప్రధాన రహదారి వెంట సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను రూపాంతరం చేసి అభివృద్ధిని చేసి చూపించడం జరిగిందని పేర్కొన్నారు. పురపాలక ఎన్నికల సైరన్ ఎప్పుడు మోగిన సంసిద్ధంగా ఉండాలని భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తూ దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, టౌన్ అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్ జబార్,ఇల్లందు ప్రధాన కార్యదర్శి పరిచూరి వెంకటేశ్వర్లు ,ఇల్లందు పట్టణ ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ, ఇల్లందు పట్టణ మహిళా అధ్యక్షురాలు నెమలి ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కోక్కు సరిత,ఇల్లందు పట్టణ మాజీ వార్డ్ కౌన్సిలర్లు కటకం పద్మావతి, ఎలమందల వాసు వీణ, తోట లలిత శారద, కడకంచి పద్మ, ఇల్లందు పట్టణ మహిళ ఉపాధ్యక్షురాలు కొడగండ్ల నారాయణమ్మ, ఇల్లందు పట్టణ నాయకులు సామల రవితేజ, పాబోలు కిరణ్, కుంటా నవాబ్, నారపాక వసంతరావు, కడకంచి వీరస్వామి, సన రాజేష్,యువజన నాయకులు నాయకులు గిన్నారపు రాజేష్, సత్తాలహరికృష్ణ, రామ్ లాల్ పాసి, ములుగుండ్ల ఉపేందర్ ఉపేందర్, బజారు సత్యనారాయణ,తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి ధీరత్వమే విప్లవ క్రాంతికారిణిగా మార్చింది

**పిడిఎస్ యూ, రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృద్వి**

**అక్షర కలం / ఇల్లందు**




ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్ యూ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇల్లందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విప్లవ క్రాంతికారిణి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత పీడీఎస్యు రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృద్వి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి, జిల్లా అధ్యక్షులు బి వీరభద్రం మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే దక్షిణ మహారాష్ట్రలో జనవరి 3వ తేదీన సాతా అనే జిల్లాలో నాయగావ్ అనే ఓ మారుమూల గ్రామంలో జన్మించిందని, సావిత్రిబాయి పూలేకి బాల్యంలోనే సమాజ సేవ, నాయకత్వ లక్షణాలు, పోరాటతత్వం, గాంభీర్యం, ధైర్యం, వీరత్వం మెండుగా ఉండేవన్నారు. ఈ గుణాలే తాను విప్లవ క్రాంతికారిణిగా ఎదగడానికి దోహదపడ్డాయన్నారు. ఆంగ్లేయుల పరిపాలన దక్షతను చూసి పూలే దంపతులు తమ ప్రజలు కూడా ఆ విధంగా ఉన్నతీకరించబడాలన్నారు. సావిత్రిబాయి ఆంగ్ల భాషలో ప్రావీణ్యం పొందడం వల్లే ఆంగ్లేయులు పాలన గురించి, పాలనలోని సామాజిక లోటుపాట్లను అర్థం చేసుకోగలిగారన్నారు. ఆనాడు బ్రాహ్మణులకు, ఆంగ్లేయులకు మధ్య గల సంబంధాన్ని అర్థం చేసుకోగలిగారన్నారు. బ్రాహ్మణులు, ఇతర సవర్ణులు ఉన్నత స్థానాల్లో ఉండడానికి రాజ్యాధికారంగల పాలకవర్గాలతో చేతులు కలపడమే కారణం అన్న రహస్యాన్ని చారిత్రక పరిశోధనల ద్వారా అర్థం చేసుకోగలిగారన్నారు. చిన్నతనం నుండే బాలికల చదువులు కోసం, మహిళల హక్కుల సాధన కోసం పోరాడిందిన్నారు. దేశంలోనే బాలికల చదువు కోసం మొట్టమొదటి పాఠశాలను ఏర్పాటు చేసి, తొలి మహిళ ఉపాధ్యాయురాలు అయ్యారన్నారు. అన్ని కులాల వారికి సమాన విద్య కోసం, బాలికల కోసం పాఠశాల నిర్వహించే క్రమంలో కష్టాలు ఎన్ని ఎదురైనా తమ విప్లవ కర్తవ్యాన్ని విస్మరించలేదన్నారు. శూద్రులు, అతిశూద్రులు, స్త్రీల జీవితంలో విప్లవాత్మకమైన చైతన్యాన్ని తీసుకువచ్చారన్నారు. 1876–77 కాలంలో మహారాష్ట్రలో తీవ్రమైన కరువు సంభవించినప్పుడు వ్యాపారస్తులు మాత్రం సరుకునంత గోడౌన్లలో దాచిపెట్టి తాళం వేసేనారనీ, అట్టడుగు వర్గాల వారు ఆకలితో అలమటించేవారనీ, దీన్ని చూసి సత్యశోధక్ సమాజ్ అనే సంస్థ ఏర్పాటుచేసి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు, కొన్నిచోట్ల 2000 మంది చిన్నపిల్లలకు భోజనం ఏర్పాటు చేశారన్నారు. తమను స్ఫూర్తిగా తీసుకొని నేటి విద్యార్థులు సమాజ మార్పు కోసం పోరాడాలన్నారు. విద్యారంగంలో వస్తున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ముందుండి కొట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బి సాయి, శ్రావణి, జిల్లా కమిటీ సభ్యులు పార్థు, శ్రావణ్, ఎం సాయి, జంపన్న, సిద్దు, రోహిత్, రామ్ చరణ్, జిల్లా నాయకులు తబిత, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

# యూరియా స్టాక్ పట్ల రైతులు ఎటువంటి ఆందోళన చెందవద్దు...

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**13 వేల 795 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ లభ్యం**

**రైతులు అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయవద్దు**

**చింతకాని మండలం నాగులవంచ వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం నందు యూరియా కేంద్రంలో కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**అక్షర కలం ఖమ్మం/ చింతకాని:**



ఖమ్మం జిల్లాలో 13 వేల 795 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందని, రైతులు ఏలాంటి అపోహలు నమ్మవద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ , చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద యూరియా కేంద్రంలో కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. జిల్లాలో యూరియా సమృద్ధిగా ఉందని, రైతులు అందరికీ పంపిణీ చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం మొత్తం 13 వేల 795 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. మార్క్ ఫెడ్ వద్ద 9736 మెట్రిక్ టన్నులు, ప్యాక్స్ వద్ద 900 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్స్ వద్ద 663 మెట్రిక్ టన్నులు, గతంలో మన దగ్గర ఉన్న అఖీఖ స్టాక్ 2495 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ అన్నారు. ప్రతి 2000 ఎకరాల సాగు విస్తీర్ణానికి ఒక యూరియా సేల్ పాయింట్ ఉండే విధంగా చర్యలు చేపట్టామని, యూరియా కోసం రైతులు ఏ సమయంలో రావాలో వారికి ముందస్తుగానే సమాచారం అందిస్తూ కూపన్లు కూడా జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని, రైతులు అధికారులకు సహకరిస్తూ వారు సూచించిన సమయంలో వచ్చి యూరియా తీసుకుని వెళ్లాలని కలెక్టర్ తెలిపారు. ఒక రైతు అతని సాగు విస్తీర్ణానికి అవసరమైనయూరియా తప్పకుండా ఇస్తామని దానికంటే అధికంగా యూరియా తీసుకుని వెళ్లకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. రైతులు ఎవరు ప్రస్తుత అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయవద్దని కలెక్టర్ రైతులకు సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ధనసరి. పుల్లయ్య, జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్, మధిర వ్యవసాయ సహాయ సంచాలకులు విజయ్ చంద్ర, చింతకాని తహసీల్దారు బాజ్జీ ప్రసాద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# మహిళా ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..

సంగారెడ్డి విద్యుత్ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.సంగారెడ్డి జిల్లా కేంద్రంలో భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే 195వ జయంతి పురస్కరించుకొని ఎఉూఖఆఅఒ సర్కిల్ ఆవరణలో ఉన్న సావిత్రి బాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన విద్యుత్ శాఖ అధికారులు ఉద్యోగులుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా జ్యోతి బాపూలే సతీమణి సావిత్రి బాయి పూలే మహిళా విద్య మరియు హక్కుల కోసం పోరాడిన భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు మరియు సంఘ సంస్కర్త అని అన్నారు, నేటి మహిళలకు సావిత్రి బాయి పూలే ఆదర్శంగా నిలిచారాని అన్నారు... ఈ కార్యక్రమంలో ూఇ ఆపరేషన్ ఆర్.సుదీర్ కుమార్, ఆఇ ఏ.శ్రీనివాస్ టెక్నికల్, ూయాడి.వీరస్వామి, ఆఇసంగారెడ్డి నెహ్రూ నాయక్, ఆఇ అమృత్ రావ్ ఇతర అధికారులు ఉద్యోగులు, ఆర్టిసన్ బీసీ నాయకుల ఆధ్వర్యంలో రీజనల్ పార్సిడెంట్ ఓ.దత్తాత్రి, రీజనల్ సెక్రటరీ ఏ.బాలకృష్ణ ఇతర డివిజన్ నాయకుల ఆధ్వర్యంలో ఎఉూఖఆఅఒ సంగారెడ్డి సర్కిల్ ఉద్యోగులు మహిళా ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు...

## సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కలెక్టర్ కు వినతిపత్రం ఇచ్చిన పెద్దాపూర్ సర్పంచ్



సంగారెడ్డి ప్రతినిధి, అక్షర కలం..

పెద్దాపూర్ గ్రామ సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ పక్కన గల సర్వీస్ రోడ్డు ఎంతోకాలంగా పెండింగ్ లో ఉన్న కారణంగా అది వెంటనే పూర్తి చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య కు వినతి పత్రం అందజేశారు. ఫ్లైఓవర్ పూర్తయి చాలా రోజులు అయినా ఇప్పటివరకు సర్వీస్ రోడ్డు లేకపోవడం వల్ల గ్రామ ప్రజలు రవాణాకు చాలా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామ సర్పంచ్ మనీషా బాలరాజ్ అన్నారు. రోజువారి పనులలో భాగంగా రైతులు స్కూల్ పిల్లలు ప్రయాణికులు ఫ్లైఓవర్ దాటడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సాధ్యమైనంత త్వరగా ఈ సమస్య పరిష్కరించాలని ఆమె కోరారు. ఇప్పటివరకు అధికారులకు ఎన్నోసార్లు వినతిపత్రం ఇచ్చిన ఇప్పటివరకు దీనిపై ఒక నిర్ణయం తీసుకోలేదని వెంటనే సర్వీస్ రోడ్డు పనులు మొదలు పెట్టాలని ఆమె కలెక్టర్ ని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభు గౌడ్, శ్రీధర్ మహేంద్ర, వెంకట్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సిర్గాపూర్ లో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు




సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం.

.సిర్గాపూర్ ఉన్నత పాఠశాల లో శనివారం సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు కార్యక్రమాన్ని సిర్గాపూర్ ఎంఈఓ నాగారం శ్రీనివాస్ ఘనంగా నిర్వహించారు. మహిళలు అందరు చదువుకున్నట్లయితే ఆ కుటుంబం చాలా గొప్పగా ఎదుగుతుందని ఆ దిశగా ప్రతి ఒక్క తల్లి దండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపి చదివించాలని,చదువుకున్న బాలికలు తమ జీవితాలను అందంగా తీర్చి దిద్దుంకుంటారని తెలియజేశారు.ఇందులో మహిళా ఉపాధ్యాయులు నిహారిక,నిర్మల, లక్ష్మి, ఉపాధ్యాయులు లక్ష్మణ్,మధుకర్ రెడ్డి,నాగభూషణం, శ్రీ రామ్, రాంచందర్,గురునాథ్,సచిన్,అన్సారీ అహ్మద్, వర ప్రకాష్, సంతోష్ కుమార్,రవీందర్ రావ్ లు పాల్గొన్నారు.

## జిల్లాలో ఈనెల 4న ఆర్టీసీ డ్రైవర్లకు కంటి పరీక్షల నిర్వహణ

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..



సంగారెడ్డి జిల్లాలో ఈనెల జనవరి 4న (ఆదివారం) ఆర్టీసీ బస్ డిపోలలో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల (ఐ చెక్ అప్) శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. వసంతరావు తెలిపారు.ఈ కంటి పరీక్ష శిబిరాలను జిల్లాలోని సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ మరియు బీహెచ్ఈఎల్ ఆర్టీసీ బస్ డిపోలలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ శిబిరాల్లో పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారులు, కంటి వైద్యులు పాల్గొని ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు ఆర్టీసీ డ్రైవర్లకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు జిల్లాలోని ఆర్టీసీ డ్రైవర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సావిత్రిబాయి పూలే ఆశయాలు నెరవేర్చాలి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాష్ రెడ్డి



సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం..

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో సావిత్రిబాయి పూలే 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మహిళా ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ప్రతి విద్యార్థికి ఉపాధ్యాయులే రోల్ మోడల్ అని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళాఉపాధ్యాయురాలని, మహిళల కోసం తొలి పాఠశాలను స్థాపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని, వారి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమన్నారు.జిల్లాలోని ఉపాధ్యాయుల్లో సుమారు 50 శాతం మహిళా ఉపాధ్యాయులే ఉన్నారని, విద్యా వ్యవస్థలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. సావిత్రిబాయి పూలే స్థాపించిన తొలి పాఠశాల వల్లనే నేడు మహిళలు విద్యావంతులై వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరుకున్నారని పేర్కొన్నారు. యువతలో వ్యసనాలను రూపుమాపేందుకుఉపాధ్యాయులు సమాజానికి దిశానిర్దేశం చేయాలనిపిలుపునిచ్చారు. ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో



మొదటి స్థానంలో నిలపడంతో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ,మూఢనమ్మకాలు, దురాచారాలు రాజ్యమేలుతున్న కాలంలో ఎన్నో అవమానాలు, కష్టాలను ఎదుర్కొని సమాజ మార్పు కోసం సావిత్రిబాయి పూలే, జ్యోతిబా పూలే కృషి చేశారని అన్నారు. వారి అహర్నిశల సేవల ఫలితంగానే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారని పేర్కొన్నారు. సమాజాన్ని మార్చిన గొప్ప వనిత సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. పిల్లలకు కాలానుగుణంగా మంచి?చెడును బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, మహిళల పట్ల సమాజంలో ఆలోచన ధోరణి మారాలని, సావిత్రిబాయి పూలే ఆశయాలను నెరవేర్చాలని కోరారు.జిల్లాలో పూలే భవనానికి కేటాయించిన స్థలంలో భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ను కోరారు.ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పదిమంది మహిళా ఉపాధ్యాయులను జిల్లా కలెక్టర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి గోవింద్ రామ్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీరమ్య యాదవ్, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణుగోపాల్, టీజీవో జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు జావిద్ అలీ, బీసీ సంఘాల ప్రతినిధులు మల్లికార్జున్ పాటిల్, ప్రభు గౌడ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పోలీస్ తనిఖీలు...: పోలీస్ కమిషనర్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:




నేరాల నియంత్రణలో భాగంగా అక్రమ రవాణా, చట్టవ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఏటియం సెంటర్లు, బ్యాంకుల పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించారు. అర్ధరాత్రి వేళలో అనుమానాస్పద వ్యక్తుల కదలికలను, వాహనాలను తనిఖీ చేశారు. అదేవిదంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా ఇసుక, గంజాయి , రేషన్ బియ్యం వంటి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల నుండి



అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించిన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తున్నామన్నారు. అదేవిధంగా మద్యం మత్తులో వాహనాలు వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న నేపథంలో డ్రంక్ అండ్ తనిఖీలు ముమ్మరం చేశారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేశారు. దొంగతనాలు జరగకుండా పాత నేరస్తుల కదలికలను కట్టడి చేసేలా అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు గాని, వాహనాలు గాని తారసపడితే వాటి గురించి పూర్తి వివరాలను సేకరించి, అనంతరం వారికి వెసులుబాటు కల్పిస్తున్నారు.

## భద్రాచలలో సీటు బెల్ట్ అవగాహన కార్యక్రమం

### ఎం వి ఐ, సంగం. వెంకట పుల్లయ్య

అక్షర కలం/భద్రాచలం

జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను పురస్కరించుకుని, భద్రాచలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో సీటు బెల్ట్ అవగాహన కార్యక్రమంఘనంగానిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వాహనదారులకు సీటు బెల్ట్ ధరిస్తే వారి భద్రత పెరుగుతుంది, ప్రమాదాల బారిన పడకుండా ఎంతో విలువైనప్రాణాలనుకాపాడుకోవచ్చని అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు విధిగా సీటు బెల్ట్, హెల్మెట్ ఉపయోగించాలి అని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట పుల్లయ్య, సూచించారు.కార్యక్రమంలో భాగంగా సీటు బెల్ట్ ధరించి వాహనాలు నడుపుతున్న వారికి గులాబీ పూలను అందించి ప్రోత్సహించారు. రవాణా శాఖ సిబ్బంది, స్థానిక అధికారులు, వాహనదారులు ఈ కార్యక్రమంలో పాల్గొని సీటు బెల్ట్ మరియు హెల్మెట్ ఉపయోగించాలన్న అవగాహన పొందారు.



## స్కూల్ బస్సు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్



అక్షరకలం/ పాలేరు:

కూసుమంచి పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు స్కూల్ బస్సు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ నిర్వహించారు.పెనుబల్లి మండలంలోశుక్రవారం అదుపుతప్పి కాలువలో బోల్తా పడిన స్కూల్ బస్సు ఘటనను దృష్టిలో పెట్టుకొని తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులను తమ బిడ్డలను భద్రంగా తీసుకెళ్లి....క్షేమంగా ఇంటికి చేరుస్తాయని విశ్వసించే తల్లిదండ్రుల నమ్మకాన్ని విస్మరించకుండా స్కూళ్ల యాజమాన్యాలు స్కూల్ బస్సుల ఫిట్నెస్ పై క్షేత్రస్థాయిలో చొరవ తీసుకోవాలని సూచించారు. అదేవిదంగా బస్సు డ్రైవర్లకు మద్యం సేవించి బస్సులు నడపకుండా అవగాహన కల్పించాలన్నారు.

## రవాణా శాఖ కార్యాలయంలో సావిత్రి భాయి పూలే జయంతి వేడు కలు.

### మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ "సంఘం. వెంకట పుల్లయ్య"

అక్షర కలం/భద్రాచలం

దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కూనవరం రోడ్డు భద్రాచలం రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే నూట తొంభై ఇదో వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం. వెంకట పుల్లయ్య మాట్లాడుతూ మహిళల బతుకుల్లో వెలుగులు నింపి



ఆడపిల్లల చదువుల కోసం ఎంతో పోరాటం చేసి స్త్రీ అంటే వంటింటికే పరిమితం కాదు అంటూ అనేక అవమానాలు పడుతున్న మహిళల్లో చీకటి బతుకుల్లో వెలుగులు నింపి భారతదేశ మొట్ట మొదటి మహిళ ఉపాధ్యాయురాలు అయి పాఠశాలలు స్థాపించిన చదువుల తల్లి సావిత్రి భాయి పూలే అలాంటి మహిళ యొక్క గొప్పతనాన్ని ఆదర్శంగా తీసుకునేటందుకు సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహనీయురాలుని మదిలో తలచుకుంటూ ఘన నివాళులు అర్పిస్తున్నట్లుగా తెలియజేశారు

# మహిళల జీవితంలో వెలుగులు నింపిన చదువులా తల్లి సావిత్రిబాయి పూలే

## కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత సావిత్రిబాయి పూలే

### కల్లెపల్లి అశోక్ జిల్లా కార్యదర్శి కేవీపీఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి

పెద్దపల్లి ,ప్రతినిధి జనవరి 03 అక్షర కలం



భారతదేశంలో మహిళా విద్య, సామాజిక సమానత్వం మరియు అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన ధీర వనిత సావిత్రిబాయి పూలే అని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్ అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రం అంబేద్కర్ విగ్రహం ముందు సావిత్రి భాయ్ పూలే 195 వ జయంతి నిర్వహించడం జరిగింది. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం కల్లేపల్లి అశోక్ మాట్లాడారు తన భర్త జ్యోతిరావు పూలేతో కలిసి భారతదేశంలో మొదటి మహిళా పాఠశాలను ప్రారంభించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారు. కుల వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తారు మరియు స్త్రీ సాధికారతకు మార్గదర్శకురాలిగా నిలిచారాని అన్నారు. కుల వ్యవస్థపై పోరాటం లో కులమత భేదాలు లేని సమాజం కోసం కృషి చేశారు, అట్టడుగు వర్గాల హక్కుల కోసం పోరాడారు. మహిళల హక్కుల కోసం, వారి సాధికారత కోసం తన జీవితాన్ని అంకిత చేశారు, అన్ని సామాజిక మూస ధోరణులను ఛేదించారు. కులమత భేదాలు లేని సమాజం కోసం కృషి చేశారు, అట్టడుగు వర్గాల హక్కుల కోసం పోరాడారు. సామాజిక అసమానతలను అంతం చేసి, అందరికీ సమానత్వం సాధించాలనే లక్ష్యంతో సామాజిక విప్లవకారిణిగా మారారు ఆమె స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం అణిచివేత వ్యతిరేకంగా పోరాటాలని పిలుపునిచ్చారు, బిజెపి కేంద్ర పాలిత ప్రాంతాలలో ఇప్పటికీ స్త్రీల పైన వివక్ష అంటరానితనం దాడులు హత్యలు హత్యాచారాలు విపరీతంగా పెరిగిపోతున్న పరిస్థితి దేశంలో కనబడుతుంది కాబట్టి దేశ మహిళ మిత్రులందరికీ సావిత్రిబాయి పూలే గారి పోరాటాన్ని స్ఫూర్తి తీసుకొని మహిళల హక్కుల కోసం రక్షణ కోసం పోరాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో ఐఎఖూ జిల్లా అధ్యక్షులు మోదుంపల్లి శ్రవణ్, అమెజ నాయకుడు సెపెల్లీ రవీందర్, అరికిల్ల రామలక్ష్మి,కుమ్మరి నవీన్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింగం,నర్బ సూరజ్, మధు.పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ ని ప్రధాన మంత్రిని చేసేవరకు ప్రతీ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త దీక్ష తో పనిచేయాలి....

## సంగారెడ్డి పట్టణం లో జరిగిన తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ బునియాది కార్యకర్త సమ్మేళనం లో పిలుపునిచ్చిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం.




.సంగారెడ్డి లో గిరిజన కార్పొరేషన్ చైర్మెన్ , నేషనల్ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యం లో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల శిక్షణా తరగతులలోఆదివాసీ కార్యకర్తలు, నాయకుల దేశ వ్యాప్త శిక్షణా తరగతుల్లో భాగంగా శనివారం ఉమ్మడి మెదక్ జిల్లా శిక్షణా తరగతులు సంగారెడ్డి పట్టణం లోని పిఎస్సార్ గార్డెన్ లో జరిగాయి. గిరిజన కార్పొరేషన్ చైర్మన్, నేషనల్ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యం లో ఈ శిక్షణా తరగతులు జరిగాయి. మూడు రోజుల పాటు జరిగే శిక్షణా తరగతులకు మొదటి రోజు టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూమహిళలకు యాభై శాతం స్థానం ఉండాలని ఇకముందు ఎక్కడ శిక్షణ తరగతులు ఏర్పాటుచేసిన మహిళలను ఉండేలా చూడాలని అన్నారు .త్వరలో జిల్లా కమిటీలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని అందులో కూడా 30 మంది మహిళలు ఉండేలా చూడాలని పది మంది ఎస్సీ ,ఎస్టీ మహిళలకు అవకాశం దక్కేలా నిర్ణయం తీసుకోవాలని అన్నారు.మెదక్ జిల్లాకు ఒక చరిత్ర ఉందని ఇందిరాగాంధీని ఎంపీగా గెలిపించి దేశానికి ప్రధానిని అందించిన జిల్లా మెదక్ అన్నారుఎంతో అదృష్టం ఉంటే తప్ప ఆడజన్మ రాదని అలాంటి ఆడవారిని అప్పటి కాలంలో అనేక కట్టుబాటులకు గురిచేసి బందీ చేశారని చదువుకు దూరం చేసి సతీసహగమనం వంటి దురాచారాలను అమలు చేసే వారిని కానీ నేటి సమాజంలో మహిళలు పురుషులకు సమానంగా ఇంకా ఎక్కువే ముందున్నారని కలెక్టర్లు అవుతున్నారని అనేక పదవులలో వారు ముందుంటున్నారు. అంటే దీనంతటికీ కారణం సావిత్రిబాయి పూలే అని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎన్నో అవమానాలు ఆటంకాలను ఎదుర్కొని సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన సావిత్రిబాయి పూలే ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారుచదువుకుంటేనే సంస్కారం సంపద వస్తాయని ఆమె గుర్తు చేశారుకాంగ్రెస్ పార్టీ ఒక్క వంద నలభై ఒక్క సంవత్సరాలు పూర్తి చేసుకున్న పార్టీ అని ఇప్పుడు ప్రజల కోసమే పాటుపడే పార్టీ కాంగ్రెస్ అన్నారు. ఆదివాసీలను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా ఎదిగేలా చేసిన ఘనత ఇందిరాగాంధీ కాంగ్రెస్ పార్టీది అన్నారు. ఇక్కడో సమాజానికి దూరంగా బ్రతికే వారిని సమాజంలోకి తీసుకొని వచ్చి వారికి అన్ని హక్కులను కల్పించిన ఘనత కాంగ్రెస్ది అన్నారు. ఈ శిక్షణా తరగతులను ఆదివాసీలందరు శ్రద్ధగా ఉపయోగించుకోవాలని ఇక్కడ నేర్చుకున్న వాటిని పదిమందికి తెలియజేయాలని ఆమె పేర్కొన్నారునేటి సమాజంలో గాంధీ పేరుని మార్చే వారున్నారని, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని తిరిగి రాస్తామని నాయకులు ఉన్నారని వారందరినీ తరిమికొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసే వరకు కాంగ్రెస్ ప్రతి కార్యకర్త ఓ దీక్షలా ముందుకు సాగాలన్నారు.

# ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం.

.సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారతీయ మహిళా విద్యకు ఆద్యురాలు, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే 195వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు పుష్ప గుచ్చం వేసి నివాళులు అర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళల విద్య, సమానత్వం కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె ఆశయాలను నేటి తరం కొనసాగించాలని, ముఖ్యంగా బాలికల విద్యకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హక్కీమ్, డా. శ్రీహరి, మందుల వరలక్ష్మి, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, వేణుగోపాల్, పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

# తెలంగాణ సర్పంచ్ ల సంఘము మహిళా విభాగం కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా రేఖా వెంకట్ రెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి,అక్షర కలం.



. తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం మహిళా విభాగం కార్యనిర్వాహక అధ్యక్షురాలిగా చెర్యాల సర్పంచ్ రేఖ వెంకట్ రెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్ లో సర్పంచుల సంఘం కార్యాలయం లో వ్యవస్థాపక అధ్యక్షులు భూమన్న యాదవ్ నియామక పత్రాలు అందజేశారు. ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి సంఘానికి మంచి పేరు తీసుకొస్తానని పదవికి ఎంపికైన చెర్యాల సర్పంచ్ రేఖ వెంకట్ రెడ్డి అన్నారు.

# బిహెచ్ఈఎల్ టౌన్ షిప్ లో ఐఎన్ టీయుసి ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రి భాయి పూలే జన్మదిన వేడుకలు

## ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి ప్రతినిధి, అక్షరకలం.



.ఐఎన్ టీయుసి ఆధ్వర్యం లో బిహెచ్ఈఎల్ టౌన్ షిప్ లో సావిత్రి భాయి పూలే 195 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సావిత్రి భాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ195సంవత్సరాలు గడిచిన సావిత్రిబాయి పూలే ను గుర్తు పెట్టుకొని జయంతి వేడుకలు జరుపుకుంటున్నామంటే వారి కృషిని గుర్తించాలని అన్నారు. జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే ఇద్దరు భార్యాభర్తలు పార్వతి పరమేశ్వరుల లాగా సంపదను అడగక సంతానాన్ని అడగక సమాజం కోసమే పాటుపడ్డ పుణ్య దంపతులు అని అన్నారు. వారి ఆదర్శాలను కొనసాగించాల్సిన అవసరం అందరిపైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బిహెచ్ఈఎల్ ఏజిఎం లు సంజయ్ బాబు, సురేష్ లు, టీపిసిసి ప్రధాన కార్యదర్శి చిన్నా ముదిరాజ్, ఐఎన్టీయుసి జిల్లా అధ్యక్షుడు నర్సింహ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ాఃఅ జిల్లా ప్రెసిడెంట్ మవీన్ గౌడ్, అడ్వైసర్ అరుణ్ గౌడ్ లు పాల్గొన్నారు




# వైభవంగా సావిత్రిబాయి జయంతి వేడుకలు



.( అక్షర కలం,నారాయణపేట, జిల్లా ప్రతినిధి,జనవరి 03)

,నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని గోటూరు గ్రామంలో శనివారం జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో సావిత్రి బాయి పూలే, జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఆమె జీవితం మన అందరికీ ఆదర్శప్రాయంగా ఉండాలని ఆమె సూచించిన మార్గాలలో నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధన్వాడలో శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ శిఖర నిర్మాణ పూజలు భక్తిశ్రద్ధలతో



(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి, 03)

ధన్వాడ : నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర దేవాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శిఖర నిర్మాణ పూజ కార్యక్రమం శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ పవిత్ర కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జ్యోతి రాంచంద్రయ్య, వార్డు మెంబర్ భారతమ్మ, పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.అదేవిధంగా గ్రామ పెద్దలు రాంచంద్రయ్య, ఉమేష్, గోవర్ధన్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, విజయ్ కుమార్, బాలకిష్టయ్య, పాల రాము, కాశయ్య, అయ్యప్ప, శివస్వాములు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సుల్తాన్పూర్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



ఎలిగేడు, జనవరి 03 అక్షర కలం

ఎలిగేడు మండలం సుల్తాన్పూర్ గ్రామంలోని శనివారం ప్రభుత్వ పాఠశాలలో భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయులు మహిళ విద్యకు మార్గదశరాలుగైన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాన ఉపాధ్యాయులు నరేంద్ర చారి మాట్లాడుతూ. మహిళ విద్య కోసం ఆమె చేసిన పోరాటాలు సమాజంలో విద్య ద్వారా చేతన తీసుకువచ్చిన విధానం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బాలికల విద్య కామెంట్ చేసిన సేవలు మరవలేని తెలిపారు. సావిత్రిబాయి పూలే విద్యను ఒక విధంగా మార్చి అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహానుభావురాలని అన్నారు. ప్రతి విద్యార్థి ఆమె జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని చదువుతోపాటు సామాజిక బాధ్యత కూడా అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేంద్ర చారి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# నెట్ బాల్ లో జాతీయ స్థాయికి ఎంపికైన నాగార్జునసాగర్ క్రీడాకారులు ..

అక్షర కలం నాగార్జునసాగర్:



డిసెంబర్ 25 26 27 తేదీలలో మహబూబ్నగర్ జిల్లా కేసముద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ నెట్ బాల్ టోర్నమెంట్ నందు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు ఎంపికైన క్రీడాకారులు కే. సంయుత్ నాయుడు ఆర్. ధనుష్ నాయక్, జె. సుప్లేవిరాజ్, ఎస్.కె రిజ్వాన, వీరు ఈనెల 11 12 13 14 తేదీలలో గచ్చిబౌలిలో స్టేడియంలో జరిగే జాతీయస్థాయి సీనియర్ నెట్ బాల్ టోర్నమెంట్ కు వెళ్ళనున్నారు ప్రస్తుతం జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు మహబూబ్నగర్ జిల్లా క్యాంప్ కార్యాలయంలో శిక్షణ పొందుతున్నట్లు ఉమ్మడి నల్లగొండ జిల్లా నెట్బాల్ అసోసియేషన్ సెక్రటరీ జె. కిరణ్ కుమార్ తెలిపారు . ఎంపికైన క్రీడాకారులను హాలియాలో టైం స్కూల్ డైరెక్టర్లు మంద నరేందర్ రెడ్డి , కత్తి కోటి రెడ్డి ,నందికొండ మున్సిపాలిటీలో వివిధ హోదాలలో ఉన్న నాయకులు, తల్లిదండ్రులు వీరిని అభినందించారు.

# సమాజానికి మీడియా "దిక్సూచిలా" ఉండాలి

ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేయాలి

సంచలనం కోసం కాకుండా, వాస్తవాలనే ప్రజలకు అందించాలి

డిజిటల్ యుగంలో జర్నలిస్టులు మరింత బాధ్యతగా ఉండి సమాజాన్ని సరైన మార్గంలో నడిపించాలి

నల్గొండ జిల్లా కలెక్టర్

బడుగు చంద్రశేఖర్

వార్తల్లో వాస్తవికత అవసరం

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్







**అక్షరకలం ప్రతినిధి, నల్గొండ**

సమాజానికి మీడియా "దిక్సూచిలా" ఉండాలనినల్గొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ అన్నారు. శనివారం జిల్లా



కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తో కలిసి తన చాంబర్ లో అక్షరకలం జాతీయ దినపత్రిక ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సమాజానికి దిక్సూచిలా పనిచేయాలని పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ కొనియాడారు. వార్తలను ప్రచురించేటప్పుడు కేవలం సంచలనం కోసం కాకుండా, వాస్తవాలను నిర్ధారించుకుని ప్రజలకు అందించాలని సూచించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని పర్యవేక్షిస్తూ, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో మీడియా పాత్ర కీలకమని కొనియాడారు. నేటి డిజిటల్ యుగంలో ఫేక్ న్యూస్ (అవాస్తవ ప్రచారం) పెరుగుతున్న తరుణంలో, జర్నలిస్టులు మరింత బాధ్యతగా ఉండి సమాజాన్ని సరైన మార్గంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జర్నలిస్టులు అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## బాధ్యతయుతంగా పనిచేయాలి.....

సమాజ హితం కోసం మీడియా ప్రతినిధులు బాధ్యతాయుతంగా పనిచేయాలని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. అక్షరకలం జాతీయ దినపత్రిక ఆధ్వర్యంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను తన చాంబర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు మీడియా ఎంతో సహకారం అందిస్తుందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. సైబర్ నేరాలు, గంజాయి వినియోగం, రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వార్తలను ప్రచురించే ముందు వాస్తవాలను సరిచూసుకోవాలని, సమాజానికి మేలు చేసే వార్తలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మీడియా కూడా టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ, ప్రజలకు వేగంగా, కచ్చితమైన సమాచారాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు, వారి కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అక్షరకలం ఎడిటర్ పిట్టల రామకృష్ణ, ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో ఎం. రాంప్రసాద్, నల్లగొండ ఆర్సీ ఇన్చార్జి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## డిపిఆర్ఓ కార్యాలయంలో...

జిల్లా పౌర సంబంధాల కార్యాలయంలో పౌర సంబంధాల శాఖ ఏడి వెంకటేశ్వర్లు అక్షరకలం 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పత్రికలు పనిచేస్తూ వాస్తవాలను మాత్రమే వార్తలుగా రాయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా పనిచేయాలని అన్నారు.

## సావిత్రి భాయి పూలె జయంతి వేడుకలు



**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి, 03)**

నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని గోటూరు గ్రామంలో, భారతదేశంలో మొట్టమొదటి తొలి మహిళ ఉపాధ్యాయిని సావిత్రి బాయ్ పూలె 195 వ జయంతి ని పురస్కరించుకొని వారికీ ఘణంగా నివాళ్ళురిపించడం జరిగింది.ఈ కార్యక్రమంలోగోటూర్ గ్రామ సర్పంచ్ సి. నాగమణి చంద్రమౌళి,ఉపసర్పంచ్ లావణ్య జైపాల్ రెడ్డి ,నారాయణపేట్ కాంగ్రెస్ జిల్లా నాయకులు గౌని నాగేశ్వర్ రెడ్డి,గోటూర్ కార్యదర్శి శేఖర్ రెడ్డి, వార్డ్ సభ్యులు బి. వెంకటేష్,వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారుమాజీ ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి,గోటూర్ గ్రామ ప్రజలు మురళి గౌడ్, మోహన్ రెడ్డి, సకాలి నారాయణ,లక్ష్మి రెడ్డి, గాజుల మైను, గౌస్, తులసీ నాయక్, రామాంజనేయులు లక్ష్మిన్నా,రాజు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## మేకలకు గొర్లకు, ఉచిత నట్టల నివారిణ మందులు పంపిణి:



**(అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి, 03)**

నారాయణపేట జిల్లాలోని నర్వ మండల కేంద్రంలో,తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు డాక్టర్ శ్రీ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పశు వైద్య శాఖలో గొర్రెలకు,మేకలకు నట్టల నివారణ ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం మక్తల్ నియోజకవర్గం, నర్వ మండల కేంద్రంలోపశువైద్య శాలలో గొర్రెలకు , మేకలకు ఉచితంగా నట్టలు నివారణ మందుల పంపిణీ చేయడం జరిగింది, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో పశువైద్యశాల వైద్యుడు డాక్టర్ శరత్ నాయుడు, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ మరియు గ్రామ సర్పంచ్ పి. హనుమంత్ రెడ్డి, ఉపసర్పంచ్ అజయ్, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ధన్వాడలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**(అక్షర కలం,నారాయణపేట, జిల్లా ప్రతినిధి,జనవరి 03,)**

ధన్వాడ: నారాయణపేట జిల్లా కేంద్రం ధన్వాడ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద శనివారం నాడు కందుల కొనుగోలు కేంద్రంను ప్రారంభించడం జరిగింది. ఈ విషయమై సింగల్ విండో మాజీ అధ్యక్షులు వై వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ ఇట్టి కొనుగోలు కేంద్రంలో రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఆఫీసియల్ పెర్సెంట్ ఇన్ ఛార్జ్ లావణ్య , ఏమ్మెల్యే వక్తిగత సహాయకులు చిట్టెం మాధవ రెడ్డి, ధన్వాడ ఏవో సైమన్, సింగల్ విండో మాజీ ఆధ్యక్షులు వై. వెంకట్రాంరెడ్డి , దన్వాడ గ్రామ సర్పంచ్ జ్యోతి పంది రాంచనీద్రయ్య , నిరంజన్ రెడ్డి, సింగల్ విండో సెక్రటరీ కె. వెంకట్రాములు, పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలుగా బి.కళ్యాణి

**ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘన సన్మానం...**

(అక్షర కలం,నారాయణపేట, జిల్లా ప్రతినిధి,జనవరి, 03,)

మరికల్: నారాయణపేట జిల్లా స్థాయిలో నిర్వహించిన జిల్లా సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలో చివరి రోజైనా శనివారం మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం లో భాగంగా మరికల్ మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఎలిగండ్ల ఉపాధ్యాయురాలు శ్రీమతి బి. కళ్యాణి ఎస్జిటి ని ఉత్తమ ఉపాధ్యాయురాలుగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రణయ్,జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, జిల్లా సైన్స్ ఫారం అధ్యక్షులు భాను , మరికల్ మండల విద్యాధికారి మిర్జా కలీముల్ల, మరియు వివిధ మండలాల మండల విద్యాధికారులు, ఉపాధ్యాయ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు శ్రీమతి సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ముందుకు సాగాలి.

**జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను**

**. (అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, జనవరి, 03)**

నారాయణపేట: శ్రీమతి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్ లో నిర్వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి



కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... మహిళలు సావిత్రిబాయి పూలే గారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని వారు జీవితంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులను, వాటన్నిటిని అధిగమించి తాను చదువుకోవడంతో పాటు మొదటిసారిగా సమాజంలో మహిళ లు చదువుకోడానికి ప్రోత్సహించి పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సావిత్రిబాయి పూలే జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని, వారి స్ఫూర్తితో మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోవాలని, మహిళా సాధికారత దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, జిల్లా మత్స్య శాఖ అధికారి రహమాన్, డీ పీ ఆర్ వో రషీద్, డీ పీ వో సుధాకర్ రెడ్డి, సీ పీ వో ఖగ వాహన్, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు,వసతి గృహాల వార్డెన్లు, బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాయత్రి విద్యానికేతన్‌లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం



**పెద్దపల్లి ప్రతినిధి జనవరి 03 అక్షర కలం**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం 2026 సందర్భంగా గాయత్రి విద్యానికేతన్ పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ శ్రీ మధు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ. మధు విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలు, రోడ్డు మీద పాటించాల్సిన ట్రాఫిక్ సంకేతాలు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్పష్టంగా వివరించారు. అలాగే విద్యార్థులచే రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించి, భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా మారాలని ప్రోత్సహించారు.అనంతరం గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ గారు మాట్లాడుతూ, కేవలం ట్రాఫిక్ సిబ్బందే కాకుండా ప్రతి వ్యక్తి స్వీయ సంరక్షణ నియమాలు పాటించినప్పుడే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు ఎలా చెల్లాచెదురు అవుతున్నాయో హృదయాన్ని తాకే విధంగా వివరించారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడంలో ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్ ,వైస్ ప్రిన్సిపల్ ప్రియాంక, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955